

దివంగత నేత, టీడీపీ వ్యవస్థాపక అధ్యక్షుడు, ఉమ్మడిరాష్ట్ర మాజీ సీఎం నందమూరి తారక రామారావు వర్ధంతి సందర్భంగా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా.. రాజకీయాలకతీతంగా.. టీడీపీ, కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ తదితర పార్టీల నాయకులు ఆయనకు నివాళులర్పించారు. 'అన్న' ఎన్టీఆర్ ఆరాధ్యదైవమని, సంస్కరణలకు ఆద్యుడని, ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన నేత అని వారంతా కొనియాడారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్ అభిమానులు, టీడీపీ నేతలు, కార్యకర్తలు అన్నదానాలు నిర్వహించారు.

సర్కారు బడుల్లో రక్తహీనత పరీక్షలు


(ఫైల్)

- 8, 9, 10వ తరగతి విద్యార్థులకు స్క్రీనింగ్

ఖమ్మం ఖానాపురం హవేలీ, జనవరి 18: ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో చదివే 8, 9, 10వ తరగతి విద్యార్థులకు రక్తహీనత పరీక్షలు నిర్వహించాలని ప్రభుత్వం ఆదేశించింది. జిల్లా స్థాయిలో విద్య, వైద్య, సంక్షేమ శాఖల అధికారులతో కూడిన నోడల్ బృందాలు విద్యార్థులకు స్క్రీనింగ్ పరీక్షలు చేయనున్నాయి. సరైన పోషక ఆహారం తీసుకోకపోవడం వల్ల శరీరంలో ఐరన్ లోపిస్తుంది. తగినన్ని ఆరోగ్యకర ఎర్ర రక్తకణాలు లేకపోవడం వల్ల తొందరగా అలసట, నీరసం, చర్మం పాలిపోయి ఉండే లక్షణాలు రక్తహీనత కలిగిన వ్యక్తుల్లో కనిపిస్తాయి. ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థుల్లో ఇలాంటి ఆరోగ్య సమస్యలు తలెత్తుతున్నట్లు విద్యాశాఖ గుర్తించింది. ఇందుకు రక్తహీనత కారణం కావచ్చని ప్రభుత్వానికి నివేదించింది.

జిల్లాకు ప్రత్యేక బృందాలు

రక్తహీనత పరీక్షల కోసం జిల్లాను యూనిట్‌గా తీసుకుని మండలాల వారీగా ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేస్తారు. ప్రతీ జిల్లాలో అన్ని ప్రభుత్వ పాఠశాల్లో ఇవి వారం రోజుల్లో పరీక్షలు నిర్వహించాలని లక్ష్యం విధించారు. విద్యార్థుల సంఖ్యకు అనుకూలంగా హిమోగ్లోబిన్ కిట్లను జిల్లా టీకా విభాగం అధికారులకు చేరవేశారు. 8వ తరగతి నుంచి పదో తరగతి విద్యార్థులను పరీక్షించే సమయంలో రక్తహీనత పరీక్షలపై స్పష్టత ఉండాలని సూచించారు. వీటిలో స్వల్పంగా, మధ్యస్థంగా, తీవ్రంగా ఉన్న విద్యార్థులను వేర్వేరుగా గుర్తించాలని పేర్కొన్నారు. మూడో కేటగిరీలో ఉన్న విద్యార్థులకు ప్రత్యేక వైద్య సేవలు అందించేందుకు వీలుగా విభజన చేయాలని సూచించారు. రక్తహీనత లోపం కలిగిన విద్యార్థులు ఎక్కువగా ఆకుకూరలు, కూరగాయలు ఎక్కువ మొత్తంలో వినియోగించడం, ఐరన్ మాత్రల్ని వాడటం వల్ల సమస్య తీవ్రత నుంచి బయటపడవచ్చని వైద్యాధికారులు చెబుతున్నారు.

ఎల్‌డబ్ల్యూఈ పనులకు మోక్షం

- తుమ్మల కృషితో ఏజెన్సీ వికాసానికి బాటలు
- ఏడు రహదారులు, పది బ్రిడ్జిలకు అటవీశాఖ పచ్చజెండా
- త్వరితగతిన పనులు పూర్తిచేయాలని అధికారులకు తుమ్మల ఆదేశం




ఏజెన్సీలో ప్రారంభమై ఆగిన రహదారి నిర్మాణ పనులు (ఫైల్)

ఖమ్మం / కొత్తగూడెం, జనవరి 18 (ఆంధ్రజ్యోతిప్రతినిధి) : ఏజెన్సీ ప్రాంతంలో మావోయిస్టు ప్రభావిత ప్రాంత నిధులతో చేపట్టిన పనులకు రాష్ట్రవ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కృషితో మోక్షం లభించింది. ఏజెన్సీ అభివృద్ధి, వికాసానికి బాటలు పడ్డాయి. దశాబ్దకాలంగా సాగుతున్న ఈ పనులపై గత ప్రభుత్వం ఎలాంటి సమీక్షలు చేయకపోవడం, ఉన్నతాధికారులు పట్టించుకోకపోవడంతో ఈ పనులు నత్తనడకన సాగుతుండడంతో పాటు అటవీ శాఖ అనుమతులు లేకపోవడంతో కొన్ని పనులను ప్రారంభించలేని పరిస్థితి ఉంది. వామపక్ష తీవ్రవాద ప్రాబల్యం ఉన్న మన్యం ప్రాంతాలను అభివృద్ధి చేసేందుకు గాను కేంద్ర ప్రభుత్వం మావోయిస్టు ప్రభావిత ప్రాంత పథకం కింద భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో రూ.341.26కోట్లతో 76 పనులను గతంలో మంజూరుచేయగా ఇందులో 227కి.మీ పొడవున 38రోడ్లు, 38బ్రిడ్జిల నిర్మాణం జరుగుతోంది. కానీ అటవీశాఖ క్లియరెన్సు లేనికారణంగా కొన్ని పనులు నిలిచిపోయాయి. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి మంత్రిగా బాధ్యతలు చేపట్టిన తుమ్మల నాగేశ్వరరావు భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో చేపట్టిన ఎల్‌డబ్ల్యుఈ పనుల గురించి ఆరాతీశారు. కొన్ని నత్తనడకన సాగుతున్నాయని, ఇంకొన్ని అటవీశాఖ క్లియరెన్సు లేకపోవడంతో ప్రారంభానికే నోచుకోలేదన్న విషయం తెలుసుకున్న తుమ్మల గురువారం సీఎంవో అధికారులను పిలిపించుకుని మాట్లాడారు. పనులు త్వరితగతిన పూర్తిచేయాలని, పనులు ప్రారంభం కాకుండా ఉన్న ఏడు రహదారులు, పది బ్రిడ్జిలకు క్లియరెన్సు పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. అలాగే అటవీశాఖ నుంచి అనుమతులు రావాల్సి ఉన్న మరో 25 పనుల విషయమై అటవీశాఖ ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్, ఇతర అదికారులతో మాట్లాడి అనుమతులు మంజూరుచేసేలా చూడాలని ఆదేశించడంతో ఆ శాఖనుంచి అనుమతులు లభించాయి. అయితే ఏజెన్సీలోని ఆదివాసీ గిరిజన గ్రామాలకు వాగులుపైనా బ్రిడ్జిలు, రహదారులు నిర్మించడం ద్వారా విద్య, వైద్యం, మార్కెటింగ్, వ్యవసాయ అభివృద్ధి, రవాణా సౌకర్యాలు మెరుగవుతాయని, తద్వారా గిరిజనులు ఆధునికత వైపు అడుగులు వేస్తారని.. రహదారులు, బ్రిడ్జిలు పూర్తయితే కుగ్రామాలకు రాకపోకలు సులువవుతాయని, గిరిజనాభివృద్ధి సాధ్యమవుతుందని తుమ్మల అధికారులతో పేర్కొన్నారు. ఎట్టకేలకు తుమ్మల తీసుకున్న చొరవతో ఎల్‌డబ్ల్యుఈ నిధులతో చేపట్టిన ఏడు రహదారులకు, పది బ్రిడ్జిలకు సంబంధించి అటవీశాఖ నుంచి అనుమతులు రావడంతో వాటి పనులు త్వరలో ప్రారంభం కానున్నాయి. మిగిలిన పెండింగ్‌లో ఉన్న అటవీశాఖ అనుమతులపైనా అధికార యంత్రాంగం దృష్టిసారించింది.

అటవీ భూమిలో అక్రమం

- పాల్వంచలో గుడి పేరుతో భవన నిర్మాణం
- చోద్యం చూస్తున్న అటవీశాఖ అధికారులు


ఎవరికీ కనిపించకుండా ఏర్పాటు చేసిన పరదాలు

పాల్వంచ, జనవరి 18: కబ్జాలకు కాదేదీ అనర్హం అన్నట్లు అది రెవెన్యూ భూమైనా.. ప్రైవేటు భూమైనా.. అటవీ భూమి అయినా పరవాలేదు. 'కబ్జా చేస్తాం మమ్మల్ని ఆపేది ఎవరు?' అన్నట్లు వ్యవహరిస్తున్నారు కొందరు మాయగాళ్లు.. కబ్జాదారులు ఏకంగా రిజర్వ్ ఫారెస్ట్ భూమిలో గుడి పేరుతో అక్రమంగా భవనాన్ని నిర్మించారు. పక్కనే ఖాళీ స్థలాన్ని సైతం చదును చేసి మరో కట్టడానికి సిద్ధం చేస్తున్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ పట్టణ పరిధిలోని వనమాకాలనీ శివారు గుట్టను కొందరు దేవుడి మందిరం పేరుతో చదును చేశారు. భారీ వాహనాలతో పెద్ద రాళ్లను తవ్వి, చెట్లను నరికి, ఆ స్థలాన్ని శుభ్రం చేశారు. గత కొద్ది రోజులుగా పగలు, రాత్రి తేడా లేకుండా భారీ యంత్రాలను మోహరించి గుట్టకు మెట్లను తయారు చేశారు. ఏకంగా భవనం నిర్మించి దానికి 'గుడి' అని పేరు పెట్టారు. ఎంట్రన్స్‌లో పరదాలు కట్టి మరీ పర్యావరణ ధ్వంసానికి పాల్పడ్డారు. ఇంత జరుగుతున్నా దీన్ని పట్టించుకునే అటవీశాఖ అధికారులే కరువయ్యారు. వారికి తెలిసినా తెలియనట్లుగా నటించడం మొదలు పెట్టడంతో స్థానికులు తమ నిర్మాణాలకు కూడా ముప్పు వాటిల్లే ప్రమాదం ఉందని భావించి మీడియాకు సమాచారం అందించారు. గతంలో ఇదే తరహాలో గుట్ట కింద నిర్మాణం చేసుకున్న వాటిని తొలగించడానికి అధికారులు సిద్ధ పడ్డారు. ఈ క్రమంలో ఓ ప్రజాప్రతినిది జోక్యం చేసుకోవడంతో ఆ సమస్య సద్దుమణిగింది. కానీ ఇప్పుడు ఏకంగా గుట్టపై భాగంలో నిర్మాణం చేస్తుండటంతో స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ఈ నిర్మాణాన్ని ఆసరా చేసుకుని తమ నిర్మాణాలను కూడా కూల్చేస్తారేమోనని అనుమానాలను స్థానికులు వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అటవీ అధికారులు తగు రీతిలో స్పందించి అక్రమ నిర్మాణాలను నిలిపివేయాలని స్థానికులు, పర్యావరణాన్ని కాపాడాలని పర్యావరణ ప్రేమికులు కోరుకుంటున్నారు. ఇదిలా ఉండగా కిందిస్థాయి ఫారెస్ట్ అధికారులు కాసులకు కక్కుర్తిలో అక్రమ నిర్మాణాలను ఈ విధంగా ప్రోత్సహిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ క్రమంలోనే వనమా కాలనీలోని గుడి నిర్మాణానికి సైతం ఇతోదికంగా సహకరించినట్లు విశ్వసనీయ సమాచారం. ఈ వ్యవహారంపై 'ఆంధ్రజ్యోతి' స్థానిక రేంజ్ అధికారిని వివరణ కోరగా గత సంవత్సరం మార్చిలో నోటీసు ఇచ్చామని చెప్పడం గమనార్హం. అయితే మొదటి నోటీసు 9 నెలల క్రితం జారీ చేస్తే నేటి వరకు నిర్మాణాన్ని కొనసాగించడానికి ఎలా సహకరించారని, ఆ నిర్మాణాన్ని ఎందుకు ఇంకా కూల్చలేదని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.


గుట్టకు వేసిన మెట్లు, నిర్మాణానికి పక్కనే మరో నిర్మాణానికి సిద్ధం చేసిన స్థలం

ఇరుజిల్లాలకు కమల సారథుల నియామకం

- బీజేపీ ఖమ్మం జిల్లా అధ్యక్షుడిగా గల్లా సత్యనారాయణ కొనసాగింపు
- భద్రాద్రి అధ్యక్షుడిగా రంగా కిరణ్ నియామకం


గల్లా సత్యనారాయణ


రంగా కిరణ్

ఖమ్మం బైపాస్‌రోడ్, జనవరి 18: భారతీయ జనతాపార్టీ ఇరుజిల్లాల అధ్యక్షులను నియమిస్తూ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడి నుంచి గురువారంరాత్రి ఓ లేఖ విడుదలైంది. ఖమ్మం జిల్లా అధ్యక్షుడిగా ప్రస్తుత అధ్యక్షుడు గల్లా సత్యనారాయణనే కొనసాగిస్తూ నిర్ణయం తీసుకోగా.. భద్రాద్రి జిల్లా అధ్యక్షుడిగా కుంచె వెంకట రంగాకిరణ్‌ను నియమించారు. రాష్ట్ర వ్యాప్తంగా పలు జిల్లాలకు నూతన అధ్యక్షుల నియామకంలో భాగంగా ఖమ్మం జిల్లా అధ్యక్షుడి మళ్లీ గల్లా సత్యనారాయణనే ఎంపిక చేశారు. పార్టీలో గ్రామస్థాయినుంచి పనిచేస్తూ అంచెలంచెలుగా ఎదిగి జిల్లా అధ్యక్షుడయ్యారు. గ్రామ, మండల, జిల్లా స్థాయిలో పలు పదవుల్లో పనిచేస్తూ 2020లో బీజేపీ జిల్లా అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన ఆయన నాటి నుంచి గ్రామ స్థాయి కమిటీల నుంచి జిల్లా స్థాయి కమిటీల వరకు సమన్వయం చేసుకుంటూ, కార్యకర్తల సమస్యలతో పాటు ప్రజా సమస్యలపై పోరాడుతూ జిల్లాతో పార్టీని ముందుకు తీసుకెళ్లారు. గతంలో అధికారపార్టీపై పలు పోరాటాలు చేసి కేసులను సైతం పోరాడి రాష్ట్ర, కేంద్ర నాయకుల నుంచి మంచి పేరు తెచ్చుకున్నారు. ఈ క్రమంలో తనకు మరోసారి జిల్లా అధ్యక్షుడిగా అవకాశం కల్పించడం పట్ల పార్టీ రాష్ట్ర అధ్యకుడు కిషన్‌రెడ్డి, జాతీయ నాయకులు బండి సంజయ్, గరికపాటి రాంమోహన రావు, పొంగులేటి సుధాకర్‌రెడ్డి, కొండపల్లి శ్రీధర్‌రెడ్డి తదితరులకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. భద్రాద్రి జిల్లాలో పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా.. కీలకంగా పనిచేస్తున్న కుంచె వెంకట రంగాకిరణ్ పార్టీ జిల్లా అధ్యక్షుడిగా నియమితులయ్యారు. తనకు బాధ్యతలు అప్పగించిన నాయకత్వానికి ఈ సందర్భంగా రంగాకిరణ్ ధన్యవాదాలు తెలిపారు. జిల్లాలో పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని పేర్కొన్నారు.

22న భద్రాద్రిలో ప్రత్యేక పూజలు

అయోధ్యలో శ్రీరాముడి విగ్రహ ప్రాణప్రతిష్ఠ నేపథ్యంలో నిర్వహణ

భద్రాచలం, జనవరి 18: అయోధ్యలో శ్రీరాముడి విగ్రహ ప్రాణప్రతిష్ఠ 22న నిర్వహించనున్న నేపథ్యంలో ఆ రోజు దక్షిణ అయోధ్యగా విరాజిల్లుతున్న భద్రాచల పుణ్యక్షేత్రంలోని శ్రీసీతారామచంద్రస్వామి ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు దేవస్థానం ఈవో ఎల్.రమాదేవి తెలిపారు. 22వ తేదీ ఉదయం 7నుంచి 7.30 వరకు నిత్యకల్యాణ మండపం వద్ద సువర్ణ పుష్పార్చన నిర్వహించనున్నారు. ఉదయం 10.30వరకు ప్రచార రథంతో శోభాయాత్ర నిర్వహించేందుకు దేవస్థానం అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. శోభాయాత్ర సమయంలో సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేయనున్నారు. ఉదయం 10నుంచి 11గంటల వరకు సంక్షేప రామాయణ హవనం, సాయంత్రం 4 నుంచి 5.30 వరకు ఆలయ ప్రాంగణంలో సుందరా కాండ పారాయణం, సాయంత్రం 5.30 నుంచి ఆలయ ప్రాంగణంలో దీపోత్సవం నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణం, ప్రచార రథానికి పూలతో ప్రత్యేక అలంకరణ చేస్తారు. ఉదయం ఏడు నుంచి సాయంత్రం 6 గంటల వరకు వచ్చే భక్తులకు బెల్లం పొంగలి ఉచిత ప్రసాద వితరణ చేయనున్నారు. అయోధ్యలో జరిగే కార్యక్రమం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తుండటంతో భద్రాద్రి రామాలయంలో ఉత్సవ శోభను ఇనుమడింపజేసేలా సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేయనున్నట్లు ఈవో తెలిపారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలన్నారు.

'లోక్‌సభ'లోనూ కాంగ్రెస్‌దే విజయం

- సోనియా నో అంటే ఖమ్మంనుంచి పోటీచేసే హక్కు నాకే ఉంది
- భద్రాద్రి క్షేత్రాన్ని అభివృద్ధి చేయాలని సీఎంకు చెబుతాం
- విలేకరుల సమావేశంలో కేంద్ర మాజీమంత్రి రేణుకాచౌదరి


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న రేణుకాచౌదరి

ఖమ్మం, జనవరి 18 (ఆంధ్రజ్యోతిప్రతినిధి): వచ్చే లోక్‌సభ ఎన్నికల్లోనూ కాంగ్రెస్‌దే విజయమని, ఖమ్మంనుంచి సోనియాగాంధీని పోటీచేయాలని సీఎం రేవంత్‌తో పాటు తామంతా కోరామని.. అందుకు ఆమె నో చెబితే కాంగ్రెస్ ఖమ్మం అభ్యర్థిత్వాన్ని అడిగే హక్కు తనకే ఉందని కేంద్ర మాజీ మంత్రి రేణుకాచౌదరి స్పష్టంచేశారు. గురువారం ఖమ్మం వచ్చిన ఆమె కాంగ్రెస్ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. భద్రాచల క్షేత్రాన్ని అభివృద్ధి చేయాలని సీఎంను కోరతామని, ఎంతో ప్రాశస్త్యం ఉన్న ఈ ఆలయ అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. ఇక బీజేపీ హిందుత్వనినాదాన్ని స్వార్థానికి వాడుకుంటోందని, రాముడే కాదు ఏ దేవుడి దర్శనానికైనా అనుమతులు అవసరంలేదని, అన్ని కులాలు, మతాలు సమానమని హిందుత్వం చెబుతోందన్నారు. బీజేపీ అయోధ్యలో విగ్రహ ప్రతిష్ఠ తర్వాత లోక్‌సభ ఎన్నికల్లో లబ్ధి పొందేందుకు ప్రయత్నిస్తోందన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రాగానే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ప్రారంభించిందని, ప్రజాపాలనలో స్వేచ్ఛ వచ్చిందని, భయాందోళనలు తొలిగిపోయాయన్నారు. రేవంత్ 20ఏళ్లపాటు సీఎంగా ఉండాలని మహిళలు కోరుకుంటున్నారన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో పువ్వాడ అజయ్‌కుమార్ ఓటమి ఖాయమని, రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందని తాను చెప్పిన మాటలు నిజమయ్యాయని, లోక్‌సభ ఎన్నికల్లోనూ కాంగ్రెస్ విజయం సాధించి కేంద్రంలో అధికారంలోకి వస్తుందన్నారు. జిల్లా నుంచి ముగ్గురు మంత్రులు ఉండడం ద్వారా అభివృద్ధి మరింత వేగిరమవుతుందని, తాను గతంలో కేంద్రమంత్రిగా, ఖమ్మం ఎంపీగా ఖమ్మంజిల్లాలో ప్రణాళికబద్ధంగా పాలేరునుంచి పర్ణశాల వరకు అభివృద్ధి చేశానని గుర్తుచేశారు. తన హయాంలో పనులు ప్రారంభించి అసంపూర్తిగా వదిలేసిన ఇరాడియేషన్ ప్లాంట్ ప్రారంభానికి చర్యలు తీసుకుంటానన్నారు. పదేళ్ల అధికారంలో లేకపోయినా కార్యకర్తలు, నాయకులు పార్టీకోసం పనిచేశారని, ఆస్తులు పోగొట్టుకున్నారని, అనేక కేసులు ఎదుర్కొని జైళ్లకు వెళ్లారని, వారందరికీ న్యాయం జరిగే వరకు వారి పక్షాన పోరడతానంటూ ముస్తఫాపై పెట్టిన కేసులను ఉటంకించారు. ఈ విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ నాయకులు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మానుకొండ రాధాకిషోర్, నగర వర్కింగ్ ప్రెసిడెంట్ దీపక్‌చౌదరి, వడ్డెబోయిన నర్సింహారావు, రామ్మూర్తినాయక్‌తో పాటు పలువురు నేతలు పాల్గొన్నారు.


ఎన్టీఆర్ వర్ధంతి కార్యక్రమంలో మాట్లాడుతున్న రేణుకాచౌదరి

తెలుగుజాతి గర్వించే నేత ఎన్టీఆర్ : రేణుక

ఎన్టీఆర్ స్ఫూర్తితో రాజకీయాల్లోకి వచ్చిన తాను కార్పొరేటర్ స్థాయి నుంచి కేంద్ర మంత్రి వరకు ఎదగగలిగానని రేణుకాచౌదరి పేర్కొన్నారు. ఎన్టీఆర్‌ను తెలుగుజాతి శాశ్వతంగా గుర్తుంచుకుందని, ఆయన ప్రజల గుండెల్లోనే ఉన్నారన్నారు. ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా ఖమ్మం ఎన్టీఆర్ సర్కిల్‌లోని ఎన్టీఆర్ విగ్రహానికి ఆమె నివాళులర్పించారు. అనంతరం అక్కడ మాట్లాడుతూ ఎన్టీఆర్ ఒక చరిత్ర అని, సినీరంగం నుంచి రాజకీయ రంగంలోకి వెలుగొందిన మహానాయకుడని, ఆయన అభివృద్ధి, సంక్షేమపథకాలు నేటిసమాజానికి ఆదర్శనీయంగా నిలిచాయన్నారు. 'టీడీపీలో ఉన్న ఏకైక మగాడు రేణుకాచౌదరి' అంటూ నాడు ఎన్టీఆర్ తనను ఉద్దేశించి వ్యాఖ్యానించేవారని గుర్తుచేసుకున్నారు. ఎన్టీఆర్ తర్వాత చంద్రబాబు టీడీపీని ముందుకు తీసకుపోతున్నారని, రాబోయే లోక్‌సభ ఎన్నికల్లో కూడా కాంగ్రెస్‌కు టీడీపీ నుంచి సహకారం అందించాలని, తద్వారా సుపరిపాలన సాధ్యమవుతుందన్నారు. రేవంత్‌రెడ్డి కూడా టీడీపీ నుంచి వచ్చి కాంగ్రెస్‌లో కీలకనేతగా, సీఎంగా ఎదిగారన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, వాసిరెడ్డి భాస్కరరావు, కేతినేని హరీష్ తదితరులు పాల్గొన్నారు.

లింగాల ఎగ్జిట్!?

- ప్రతిపాదనలకే పరిమితమైన ఎన్‌హెచ్‌ఏఐ ఎగ్జిట్
- గతంలో అధికారులకు విన్నవించిన ప్రజాప్రతినిధులు
- మిగతా చోట్ల నిర్మిస్తుండటం పట్ల స్థానికుల విస్మయం
- జిల్లా మంత్రులు చొరవ చూపాలని వినతి



లింగాల వైపు నుంచి నిర్మిస్తున్న గ్రీన్‌ఫీల్డ్ హైవే

కల్లూరు, జనవరి 18: అది కల్లూరు నుంచి మధిర వెళ్లే దారి. రెండు వరుసల దారి అ యినప్పటికీ విపరీతమైన రద్దీ ఉంటుంది. అయితే ఇప్పుడు ఆ దారి మధ్యలో నుంచి గ్రీన్ ఫీల్డ్ హైవే నిర్మిస్తున్నారు. ఈ హైవే నిర్మాణంతో ఈ ప్రాంత రూపురేఖలు మా రుతాయని ఇక్కడి ప్రజలు విశ్వసిస్తున్నారు. ఈ హైవేను కల్లూరు-మధిర రహదారి మధ్యలో నుంచి నిర్మాణం చేస్తున్నారు. ఈనేపథ్యంలో కల్లూరు మండలం లింగాల వద్ద ఎగ్జిట్ పాయింట్ ఏర్పాటు చేయాలని అప్పట్లో అధికారులు భావించారు. ఇప్పడది ప్రతిపాదలనకే పరిమితమైందని తెలుస్తోంది. లింగాల వద్ద ప్రధాన రహదారిపై కల్లూరు నుంచి మధిర వైపున వెళ్లే గ్రామాలకు ఈ మార్గం అను సంధానంగా ఉంటుంది. లింగాల వైపు నుంచే గ్రీన్‌ఫీల్డ్ రహదారి వెళ్తుం డటంతో ఈ ప్రదేశం వద్ద ఎగ్జిట్ నిర్మించాలని పలు గ్రామాల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. పది నెలల క్రితం ఎంపీ నామా నాగేశ్వరరావు, రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, అప్పటి సత్తుపల్లి ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్యలు వేర్వేరుగా కేంద్ర ఉపరితల రవాణశాఖ మంత్రి నితిన్ గడ్కరీని కలిశారు. లింగాల వద్ద గ్రీన్‌ఫీల్డ్ హైవే పై ఎగ్జిట్ ఏర్పాటు ఆవశ్యకతను వివరించారు. కల్లూరు ఎంపీపీ బీరవల్లి రఘు, జడ్పీటీసీ కట్టా అజయ్‌కుమార్‌లు కూడా లింగాల ఎగ్జిట్ ఏర్పాటు విషయమై కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీని, జిల్లా ప్రజా ప్రతినిధులను కలిసి విన్నవించారు. అప్పట్లో ఎన్‌హెచ్‌ఏఐ సానుకూలంగా స్పందించి నట్టు సమాచారం. ఖమ్మం నుంచి దేవరపల్లి వరకు నిర్మించనున్న గ్రీన్‌పీల్డ్ రహదారిపై ఇప్పటికే వైరా మండలంలోని సోమవరం, పెనుబల్లి మండలం ముత్తగూడెం వద్ద ఎగ్జిట్ ఏర్పాట్లు జరుగుతున్నాయి. కానీ కల్లూరు మండలంలోని లింగాల వద్ద మాత్రం నేటి వరకు ఎగ్జిట్ ఏర్పాటుకు ఎన్‌హె చ్‌ఏఐ అధికారులు ముందుకు రాని పరిస్థితి. ఇప్పటికైన కల్లూరు నుంచి మధిర రహదారి పై పలు గ్రామాల నుంచి వాహనాల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఎగ్జిట్ ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది. ప్రస్తుతం ప్రభుత్వం మారిన నేపథ్యంలో ఉ మ్మడి ఖమ్మం జిల్లా నుంచి భట్టి విక్రమార్క, తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డికి మంత్రి పదవులు దక్కిన నేపథ్యంలో.. లింగాలలో ఎగ్జిట్ ఏర్పాటు చేసే దిశగా చర్యలు తీసుకోవాలని ఇక్కడి ప్రజలు కోరుతున్నారు.

కుప్పకూలిన గ్రీన్‌ఫీల్డ్ హైవే వంతెన

» శ్లాబ్ పోస్తుండగా కూలిన వైనం » ఐదుగురు కూలీలకు స్వల్పగాయాలు .. వైరా సమీపంలో ఘటన

వైరా, జనవరి 18: రూ.వేల కోట్లు వెచ్చించి చేపట్టిన గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్మాణాల్లో డొల్లతనం బయటపడింది. ఖమ్మంజిల్లా వైరాకు సమీపంలో గురువారం సాయంత్రం నిర్మాణంలో ఉన్న గ్రీన్‌ఫీల్డ్ హైవే అండర్‌పాస్ వంతెన కుప్పకూలింది. 20అడుగుల ఎత్తులో నిర్మిస్తున్న శ్లాబ్ కూలడంతో ఐదుగురు కూలీలకు స్వల్పగాయాలయ్యాయి. ఈ వంతెన శ్లాబ్ కూలిన సమయంలో వచ్చిన భారీ శబ్ధంతో పరిసరాల్లోని గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్మాణ సిబ్బంది, స్థానిక ప్రజలు ఉలిక్కిపడ్డారు. ఏంజరిగిందో తెలియక అక్కడి వారంతా నిర్ఘాంతపోయారు. హెచ్‌జీ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ వారు ఖమ్మం-దేవరపల్లి రహదారి ప్యాకేజీ 1 కింద ఖమ్మం రూరల్ మండలం తల్లంపాడు నుంచి వైరా మండలం సోమవరం వరకు 33.60కిలోమీటర్ల రోడ్డును రూ.772.11కోట్లతో నిర్మిస్తున్నారు. 2022 నవంబరులో ఈ నిర్మాణం ప్రారంభం కాగా.. వైరా నుంచి ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేట వెళ్లే రాష్ట్రీయ ప్రధాన రహదారిలో వైరా - సోమవరం గ్రామాల మధ్య 33వ కిలోమీటర్ వద్ద రోడ్డు క్రాసింగ్ కోసం అండర్‌పాస్ బ్రిడ్జిలతో పాటు దేవరపల్లి నుంచి ఖమ్మం వైపు వెళ్లేందుకు ఎగ్జిట్ ఇచ్చి సర్వీస్ రోడ్లు నిర్మిస్తున్నారు. దీనిలో భాగంగా గత కొన్నినెలల నుంచి అండర్‌పాస్ వంతెనలను నిర్మిస్తున్నారు. ఈ వంతెనల శ్లాబ్ నిర్మాణం కోసం సెంట్రింగ్ ఏర్పాటు చేశారు. దేవరపల్లి నుంచి ఖమ్మం వైపు వెళ్లే అండర్‌పాస్ వంతెన శ్లాబ్ నిర్మాణాన్ని గురువారం చేపట్టి.. భారీ హైడ్రాలిక్ మిషన్‌తో శ్లాబ్ పైభాగంలో వైబ్రేషన్ చేస్తున్నారు. ఈ వంతెన 132 అడుగుల పొడవు, 20అడుగుల ఎత్తులో ఉండగా ఒక్కసారిగా ఈ శ్లాబ్ కప్పకూలింది. ఆ సమయంలో హైవేకు చెందిన ఇంజనీర్లతోపాటు కూలీలు పైనే ఉన్నారు. వారు శ్లాబ్‌తో పాటు కిందపడగా.. వారిలో ఐదుగురికి స్వల్పగాయాల య్యాయి. అయితే ఆ సమయంలో కింద, సమీపంలో ఎవరూ లేక పోవ డంతో భారీ ప్రమాదమే తప్పింది. వైరా సీఐ ఎన్.సాగర్ సంఘటనాస్థలాన్ని సందర్శించి పరిస్థితిని పోలీసు ఉన్నతాధికారులకు తెలిపారు.


వైరా వద్ద కుప్పకూలిన గ్రీన్‌ఫీల్డ్‌హైవే అండర్‌పాస్ వంతెన శ్లాబ్

సెంట్రింగ్ ఏర్పాటులో నిర్లక్ష్యం వల్లేనా?

సెంట్రింగ్ ఏర్పాటులో జరిగిన నిర్లక్ష్యం వల్లే శ్లాబ్ కూలిపోయిందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. హైవేల నిర్మాణ, నాణ్యత, పర్యవేక్షణ వివరాలు స్థానికంగా ఎవరికీ అందుబాటులో లేకపోవడంతో గ్రీన్‌ఫీల్డ్ హైవే అథారిటీ అధికారులు తాము చేసిందే పనిగా ఉందని, కనీసం జవాబుదారీతనం కూడా లేదన్న ఆరోపణలున్నాయి. అందుకు నిర్మాణంలోనే కూలిన ఈ వంతెన శ్లాబ్‌అని ప్రజలు విమర్శిస్తున్నారు. ఈ నిర్మాణం కూలిన తర్వాత కూడా నేషనల్ హైవే అథారిటీ అధికారులు తీరికగా సంఘటనాస్థలానికి చేరుకున్నారని పలువురు ఆక్షేపించారు. కనీసం విలేకరులకు వివరాలు చెప్పడానికి కూడా ఇంజనీరింగ్ అధికారు లు, సిబ్బంది నిరాకరించడంపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతుండగా కొందరు అధికారులు విలేకరులు అడిగిన ప్రశ్నల్లో ఒకట్రెండు ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చారు తప్ప సమాచారమేమీ ఇవ్వలేదు.

రోడ్డు విస్తరణ పనుల పొడిగింపునకు సర్వే

అశ్వారావుపేట, జనవరి 18: అశ్వారావుపేట పట్టణంలో నాలుగు నెలలుగ నిలచిపోయిన పనులను త్వరితగతిన ప్రారంభించి, పూర్తిచేసేందుకు ఆర్‌అండ్‌బీ అధికారులు చర్యలు ప్రారంభించారు. గురువారం విస్తరణ పనులు పొడిగింపుకోసం ఆర్‌అండ్‌బీ డీఈఈ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సర్వే ప్రారంభించారు. "గురువారం ఆంధ్రజ్యోతిలో కొనసాగుతున్న విస్తరణ పనులు అనే శీర్షికన కథనం ప్రచురితమైంది. దీనికి అధికారులు స్పందించారు. పట్టణంలోని జంగారెడ్డిగూడెం రోడ్డులో సరిహద్దు చెక్‌పోస్టువరకు, ఖమ్మం రోడ్డులో వ్యవసాయ కళాశాల వరకు పొడించేందుకు సర్వేను చేశారు.ఎన్నికల ముందు ప్రారంభించి మధ్యలో నిలిపివేసిన విస్తరణ పనులను తక్షణమే ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని అధికారులు వివరించారు., ఇప్పటికే కాంట్రాక్టర్లకు నోటీసులు జారీ చేసినట్టు అధికారులు తెలిపారు. కొద్దిరోజుల్లోనే ఈ పనులు ప్రారంభించేలా అన్నిరకాల చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. పనులు పూర్తి, అదనపు నిధులు మంజూరు కోసం ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపుతామని త్వరలోనే పనులు పూర్తవుతాయని అధికారులు తెలిపారు. పనుల్లో నాణ్యత పాటించేలా దగ్గరుండి పర్యవేక్షిస్తామని పేర్కొన్నారు.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

ఆళ్లపల్లి ఎత్తిపోతల పథకాలకు రూ. కోటికి పైగా అవసరం

ఆళ్లపల్లి, జనవరి 18: ఆళ్లపల్లి మండలంలో పనిచేయని ఎత్తిపోతల పథకాలు రైతులకు అందుబాటులోకి రావాలంటే అధికారుల అంచన ప్రకారం రూ. 107.50 లక్షలు అవసం ఉంది. ఈ నెల 15న ఆంధ్రజ్యోతిలో ఉత్తిపోతల పథకాలు అనే కథనం ద్వారా ఆళ్లపల్లి మండలంలో ఉన్న ఎత్తిపోతల పథకాల మరమ్మతులు, ఇతర సమస్యలపై కథనం ప్రచురితమైంది. దాంతో ఇరిగేషన్ అధికారులు సర్పందిస్తు.. కిన్నెరసాని వరదలకు ఆళ్లపల్లి, అనంతోగు లిఫ్ట్‌లు నీట మునిగి పనిచేయడం లేదని, ఆయ పునరుద్ధరణ పనులకు రూ. 26 లక్షలు, మర్కోడు, పాత రామానుజగూడెం ఎత్తిపోతలను ఏర్పాటు చేసి సుమారు 28 సంవత్సరాలు కావడంతో ఆయా స్థానాల్లో పునరుద్ధరణ పనులకు రూ.81.50 లక్షలు నిధులు అవసరం కోసం ప్రభుత్వానికి ఆమోదం పంపామని నియోజకవర్గ ఇరిగేషన్ అధికారి వెంకటేశ్వరావు తెలిపారు. ఇవి కనుక పూర్తయితే ఆళ్లపల్లి మండల రైతుల కష్టాలు తీరుతాయన్నారు. పంటభూములకు పుష్కలంగా నీరు అందుతుందన్నారు. కాగా, ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులు పలు దఫాలుగా ఎమ్మెల్యే లేదా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, ఎత్తిపోతల పథకాల సమస్య పరిష్కరించే విధంగా కృషి చేయాలని రైతులు కోరుతున్నారు.

గుణాత్మక బోధన.. అత్యున్నత వసతి

» మైనార్టీ గురుకులాల్లో ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానించిన ప్రభుత్వం .. ఆన్‌లైన్‌లో స్వీకరణ ప్రారంభం



ఖమ్మం ఖానాపురం హవేలీ, జనవరి 18: మైనార్టీ ఆంగ్ల మాధ్యమ గురుకులాలు విద్యార్థుల ఉన్నతికి బాటలు వేస్తున్నాయి. అనుభవజ్ఞులైన బోధనా సిబ్బంది.. వసతి.. భోజన సదుపాయం.. ఇలా ఎన్నో సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయి. ఈ తరుణం లో 2024-25 విద్యా సంవత్సరంలో ప్రవేశానికి గురువారం నుంచి ఆన్‌లైన్‌లో దరఖా స్తుల స్వీకరణ ఆహ్వానం పలుకుతున్నాయి. వచ్చే విద్యా సంవత్సరానికి ఐదో తరగతి, ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశాలు, 6, 7, 8 తరగతుల్లో ఖాళీల భర్తీకి మైనార్టీ సంక్షేమ శాఖ చర్యలు చేపట్టింది. ఈ క్రమంలోనే ఐదో తరగతిలో 440, ఇంటర్‌లో 480 మందికి ప్రవేశాలు కల్పించనున్నారు. 6, 7, 8 తరగతుల్లో ఖాళీగా ఉన్న 462 మైనార్టీ సీట్లు భర్తీ చేయనున్నారు.

వసతులు.. ప్రయోజనాలు

ఏటా విద్యార్థులకు పాఠ్య, రాత పుస్తకాలు, ఏక రూప దుస్తులు, క్రీడా దుస్తులు, కాస్మోటిక్ సామగ్రి అందిస్తున్నారు. నిత్యం ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం, రాత్రి భోజనం, సాయంత్రం స్నాక్స్ ఇస్తారు. వారంలో ఐదు రోజులు కోడిగుడ్డు, నెలలో ఆరుసార్లు మాంసంతో భోజనం వడ్డిస్తారు. ఆరోగ్య పర్యవేక్షకులు అందుబాటులో ఉన్నారు. గతేడాది పదో తరగతిలో అన్ని గురుకులాలు శతశాతం ఉత్తీర్ణతను సాధించాయి. భద్రతలో భాగంగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. 75 శాతం మైనార్టీలు, 12 శాతం బీసీలు, 6 శాతం ఎస్సీలు, 4 శాతం ఎస్టీలు, 3 శాతం ఓసీలకు సీట్ల కేటాయింపులో రిజర్వేషన్లు అమలు చేస్తున్నారు.

లక్కీడిప్‌లో ఇతర వర్గాల ఎంపిక

విద్యార్థుల తల్లిదండ్రుల వార్షిక ఆదాయం గ్రామీణ ప్రాంతమైతే రూ.1.50 లక్షలు, పట్టణమైతే రూ.2 లక్షలు ఉండాలి. మైనార్టీ కేటగిరీలో తొలిగా దరఖాస్తు చేసుకున్న వారికి ప్రాధాన్యం ఉంటుంది. ఇతర వర్గాలకు మాత్రం లక్కీడిప్‌ను అనుసరిస్తారు. కళాశాల స్థాయిలో హస్నాబాద్‌లో సీఈసీ, హెచ్‌ఈసీ, మిగిలిన చోట్ల ఎంపీసీ, బైపీసీ కోర్సులు కొనసాగుతున్నాయి ఖాళీలు, ఇతరత్రా వివరాలకు మైనార్టీ గురుకుల పాఠశాల లేదా మైనార్టీ సంక్షేమ శాఖ కార్యాలయంలో సంప్రదించాలి.

● ఖమ్మం నగరంలోని రాపర్తినగర్, రఘునాథపాలెంలోని మైనారిటీ గు రుకులాల్లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆయా కళాశాలల ప్రిన్సిపాల్స్ తెలిపారు. రఘునాథపాలెం మైనారిటీ బాలికల గురుకులంలో 6 నుంచి 8 తరగతులు ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ స్వాతి తెలిపారు. రాపర్తినగర్ మైనారిటీ గురుకులంలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం, 6 నుంచి 8 తరగతులలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ అబిదా సల్మా తెలిపారు. మైనారిటీ వర్గాలకు 75 శాతం, నాన్ మైనారిటీ వర్గాలకు 25 శాతం సీట్లు అందుబాటులో ఉన్నాయని తెలిపారు.

లోక్ సభ ఎన్నికల కోసమే
బీజేపీ రామనామ జపం: కూనంనేని



మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు

ఖమ్మం సంక్షేమవిభాగం, జనవరి 18: లోక్ సభ ఎన్నికల్లో రాజకీయంగా లబ్ధి పొందేందుకే బీజేపీ శ్రీరామ జపం చేస్తోందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ఆరోపించారు. గురువారం సీపీఐ కౌన్సిల్ సమావేశాలు ఖమ్మంలోని గిరిప్రసాద్ భవన్‌లో శింగు నర్సింహారావు అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన కూనంనేని మాట్లాడుతూ ప్రజా ఉద్యమాల పరిష్కారం ధ్యేయంగా సీపీఐ ఉద్యమ కార్యాచరణ చేస్తుందన్నారు. తెలంగాణలో ఓటమి తర్వాత బీఆర్ఎస్ పార్టీ తొందరపాటుకు గురైతుందని, అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్‌పై వెంటనే విమర్శలు చేయటం సమంజసం కాదన్నారు. కార్యక్రమంలో జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు, జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్, జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేశ్, రాష్ట్ర కంట్రోల్ కమిషన్ చైర్మన్ మహ్మద్ మౌలానా ప్రసంగించారు.

ఖమ్మం వైద్య కళాశాల సందర్శనకు కౌన్సిల్ సభ్యుల రాక



గత ఏడాది జిల్లా ఆస్పత్రి తనిఖీ కోసం వచ్చిన జాతీయ మెడికల్ కౌన్సిల్ సభ్యులు (ఫైల్)

ఖమ్మం కలెక్టరేట్, జనవరి 18: ఖమ్మం వైద్య కళాశాల రెండో ఏడాది ఉన్నతి కోసం అర్హతలు సౌకర్యాలపై జాతీయ మెడికల్ కౌన్సిల్ సభ్యులు జిల్లాకు రానున్నట్లు సమాచారం. ఈ మేరకు మెడికల్ కళాశాల అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. రాష్ట్రంలో కొత్తగా మంజూరైన కళాశాలలను ప్రత్యేక బృందాలు గత ఏడాది జనవరిలో పరిశీలించారు. అయితే ఈ సారి రెండో ఏడాది అప్‌గ్రేడేషన్ కోసం కళాశాలలో, ఆస్పత్రిలో ఉన్న సౌకర్యాలు, సదుపాయాలు పరిశీలించేందుకు ఈ బృందం మరో మారు రానున్నట్లు తెలిసింది. బోధనాసుపత్రిలో ఉన్న వసతులు, వైద్యులు సౌకర్యా లు, బెడ్‌ల సామర్థ్యం తదితర అంశాలను వారు క్షుణ్ణంగా పరిశీలించనున్నారు. నిత్యం ఓపీ, ఇన్‌పేషంట్ల నమోదు పనిచేస్తున్న సిబ్బంది వైద్యుల వివరాలను కూడా సేకరించనున్నారు. జనరల్ మెడిసిన్, జనరల్ సర్జన్, ఈఎన్‌టీ, ఆప్తాలమిస్ట్, డెర్మ టాలజీ, ఆర్థో, పిడియాట్రిక్, గైనకాలజీ, ఎనస్థీషియా, ఎస్‌పీఎం (ప్రివెంటరీ మెడిసిన్) లాటి విభాగాలను కూడా వారు పరిశీలించనున్నారు. రెండు మూడు రోజుల్లో ఈ బృందం వస్తుందని మెడికల్ కళాశాల అధికారులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి


మృతి చెందిన కొర్రి సత్యనారాయణ

అశ్వారావుపేట రూరల్, జనవరి 18: మండలంలోని తిమ్మాపురం సమీపంలో గురువారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని ఆసుపాక గ్రామానికి చెందిన కొర్రి సత్యనారాయణ(25) అనే వ్యక్తి ద్విచక్ర వాహనంపై అశ్వారావుపేటకు వస్తున్నాడు. ఇదే సమయంలో అశ్వారావుపేటవైపు నుంచి వినాయకపురంకు మరో ద్విచక్ర వాహనం వెళుతుంది. రెండు ద్విచక్ర వాహనాలు తిమ్మాపురం సమీపంలో ఢీకొన్నాయి. ప్రమాదంలో సత్యనారాయణ అక్కడికక్కడే మృతి చెందారు. మరో వ్యక్తికి గాయాలు అయ్యాయి. మృతుడికి భార్య, బాబు ఉన్నారు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శ్రీకాంత్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ రెండేళ్ల బాలుడు..

జూలూరుపాడు, జనవరి18: మండలంలోని వినోభానగర్‌కు చెందిన రెండేళ్ళ బాలుడు గుగులోత్ కుషాల్ రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ ఖమ్మంలోని మమత ఆసుపత్రిలో మృతి చెందాడు. గురువారం పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. తండ్రి గుగులోత్ పవన్‌కళ్యాణ్, కుమారుడు కుషాల్ కలిసి ద్విచక్రవాహనంపై కొమ్ముగూడెం నుంచి వినోభానగర్ గ్రామానికి బుధవారం రాత్రి వస్తుండగా జూలూరుపాడులో రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో తండ్రి అక్కడికక్కడే మృతి చెందాడు. కుషాల్ తీవ్రంగా గాయపడడంతో అతనికి చికిత్సలు అందించేందుకు ఖమ్మంలోని మమత ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బాలుడు బుధవారం అర్ధరాత్రి మృతి చెందాడు. తాను, కుమారుడు, భర్తతో కలిసి ద్విచక్రవాహనంపై వినోభానగర్‌కు వస్తుండగా, ఖమ్మం నుంచి కొత్తగూడెం వైపు కారు నడుపుకుంటూ వెళ్తున్న మణుగూరుకు చెందిన జెన్కో ఇంజనీర్ శీల శశిధర్ ఎదురుగా వస్తున్న ఢీకొట్టడంతోనే వారిద్దరు మృతి చెందారని పవన్‌కల్యాణ్ భార్య సునిత ఫిర్యాదు చేసింది. ఆమె ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ తిరుపతిరావు తెలిపారు. తండ్రి, కొడుకులు రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో వినోభానగర్‌లో విషాదఛాయలు అలుముకున్నాయి. కుటుంబ సభ్యులు, బంధువుల రోదనలు మిన్నంటాయి.

కంపా నిధుల వినియోగంలో అగ్రగామిగా తెలంగాణ

అటవీశాఖ ఐఎఫ్ఎస్ పీసీసీఎఫ్ (హరితహారం) సువర్ణ


విత్తనాలను పరిశీలిస్తున్న పీసీసీఎఫ్ డాక్టర్ సువర్ణ

సత్తుపల్లిరూరల్, జనవరి18: కంపా నిధుల వినియోగంలో కొన్నేళ్లుగా అగ్రగామి గా తెలంగాణ అగ్రగామిగా ఉందని, ఈసారి కూడా ఆ నిధుల కోసం ప్రతిపాదనలు సిద్ధం చేశామని అటవీశాఖ ఐఎఫ్ఎస్ పీసీసీఎఫ్ (హరిత హారం), కంపా సీఈవో డాక్టర్ సువర్ణ అన్నారు. గురువారం ఆమె సత్తుపల్లి డివిజన్‌లో పర్యటించారు. తొలుత పెనుబల్లి మండలంలోని భవన్నపాలెం బీట్‌లో వాచ్ టవర్ (యాతాలకుంట), కిష్టారం, జగన్నాధపురం ప్లాంటేషన్, పీటీ, పనులు, వన నర్సరీని సందర్శించి పలు సూచనలు చేశారు. అనంతరం సత్తుపల్లి మునిసిపాలిటీలోని 275 ఎకరాలలో విస్తరించి ఉన్న నీలాద్రి అర్బన్ పార్క్‌ను సందర్శించారు.

హరితహారంలో 20కోట్ల మొక్కలు నాటుతాం

హరితహారంలో భాగంగా ఈసారి సుమారు 20కోట్ల మొక్కలు నాటేందుకు సి ద్ధంగా ఉన్నాయని అన్ని ప్రభుత్వ శాఖల సమన్వయంతో విజయవంతంగా నిర్వహిం చేందుకు సన్నద్ధమ వ్వాలని కోరారు. కంపా నిధులతో చేపట్టే పనులకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నామని చెప్పారు. కంపా నిధులతో తెలంగాణ అటవీ శాఖ చేపట్టిన ప్రత్యామ్నాయ అటవీకరణ, అడవుల పునఃరుద్ధరణ, ఇతర పనులకు కేంద్రం నుంచి ప్రశంసలు దక్కాయని అన్నారు. ఈసారి వానల్ వాపస్ రావాలే అనే నినాదంతో మొక్కలు నాటుతున్నట్లు ఆమె ప్రకటించారు. హరితహారంలో అన్ని శాఖలు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఆమె వెంట సీసీఎఫ్ భీమా, జిల్లా అటవీ శాఖ అధికారి సిద్ధార్థ విక్రంసింగ్, ఎఫ్‌డీవో మంజుల, ఎఫ్ఆర్‌వోలు స్నేహ లత, అరవింద్, ఎఫ్‌బీవోలు నరసింహా, మంగారావు, మదన్ ఉన్నారు.

జీడిమామిడితోటలో
దుప్పి చర్మం లభ్యం

ములకలపల్లి, జనవరి 18: జీడి మామిడితోటలో ఒక చెట్టుకు ఆరబెట్టిన దుప్పి చర్మం లభ్యమైంది. ఈ ఘటన ములకలపల్లి మండలంలో తాళ్లపాయి గ్రామ సమీపంలో గురువారం వెలుగు చూసింది. ఈసంఘటనకు సంబంధించి గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామ సమీపంలో తోటలోని చెట్టుకు వేలాడ దీసిన దుప్పి చర్మం కనిపించటంతో ఈవిషయాన్ని ములకలపల్లి అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు. ఈవిషయం తెలుసుకున్న అటవీశాఖ అధికారులు సంఘటనా స్థలానికి చేరుకొని దుప్పి చర్మాన్ని స్వాధీనం చేసుకొని అటవీ కార్యాలయానికి తరలించారు. ఈవిషయంపై రేంజర్ రవికిరణ్ వివరణ కోరగా గుర్తు తెలియని వ్యక్తులు తోటలో ఆరవేసిన దుప్పి చర్మం లభ్యంపై విచారణ జరుపుతున్నామని తెలిపారు. నాటు తుపాకీతో వేటాడినట్లు ప్రచారం జరుగుతోందని, పూర్తి స్థాయిలో విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని వివరించారు.

మరోసారి తెరపైకి ఆదివాసీ అభ్యర్థి అంశం

అన్నిప్రధాన రాజకీయ పక్షాలు పరిగణలోకి తీసుకోవాలి
23న మహబూబాబాద్‌లో
సమావేశం నిర్వహించే యోచనలో ఆదివాసీలు



భద్రాచలం, జనవరి 18: రానున్న లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ఎస్టీ నియోజకవర్గమైన మహబూబాబాద్ లోక్‌సభ స్థానంలో ఆదివాసీ కోయ తెగకు చెందిన వారిని ప్రధాన రాజకీయ పక్షాలు అభ్యర్థిగా ప్రకటించాలనే అంశం మరోసారి తెరపైకి వస్తోంది. మహబూబాబాద్ పార్లమెంట్ స్థానం 2009లో ఆవిర్భవించగా నాటి నుంచి 2014, 2019 ఎన్నికల్లో ఆదివాసీల్లోని కోయ సామాజిక వర్గానికి న్యాయం జరగడం లేదనే ఆవేదన ఆదివాసీల్లో వ్యక్తమవుతోంది. ఈ విషయమై ఇప్పటికే 2023 డిసెంబరు 28న భద్రాచలంలో జరిగిన జాతీయ ఆదివాసీ గిరిజన అభ్యుదయ సంఘం ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఉమ్మడి ఖమ్మం జడ్పీ మాజీ చైర్మన్, మాజీ ఎమ్మెల్యే చందా లింగయ్యదొర తెరపైకి తెచ్చారు. రెండు తెలుగు రాష్ట్రాల్లోని ఎస్టీ పార్లమెంటు స్థానాలైన ఆదిలాబాద్, మహబూ బాబాద్, అరకు స్థానాలను ఆదివాసీలకే కేటాయించాలని జాతీయ ఆదివాసీ అఖిలపక్ష సంఘాల కన్వీనర్ చందా లింగయ్యదొర డిమాండ్ చేశారు. ఈ క్రమంలో మరోసారి తుడుందెబ్బ గోండ్వానా సంక్షేమపరిషత్ ఆదివాసీ సంక్షేమపరిషత్ నాయకులు మహబూబాబాద్ జిల్లా బయ్యారం మండలం చర్లపల్లిలో గురువారం సమావేశం కావడం ఈ అంశం ప్రస్తావనకు వచ్చింది. ఈ నేపథ్యంలో ఈ నెల 23న లోక్‌సభ నియోజక వర్గ కేంద్రమైన మహబూబాబాద్‌లో కీలక సమావేశాన్ని నిర్వహించాలని నిర్ణయించారు. ఈ సందర్భంగా అన్ని రాజకీయ పార్టీలకు కోయ సామాజిక వర్గానికి చెందిన అభ్యర్థికి ఎంపీ టికెట్ ఇవ్వాలని వారు వినతిపత్రం అందజేయనున్నట్లు పేర్కొంటున్నారు. 1967లో భద్రాచలం లోక్‌సభ నియోజకవర్గం ఆవిర్భవించగా 2008లో నియోజకవర్గం రద్దయ్యేంత వరకు 11 సార్లు ఎన్నికలు జరగ్గా అందరూ ఆదివాసీలకే సముచిత ప్రాధాన్యం దక్కిన విషయాన్ని వారు ఉదహరిస్తున్నారు. 2009లో మహబూబాబాద్ కేంద్రంగా లోక్‌సభ స్థానం ఆవిర్భవించగా దాని పరిధిలో డోర్నకల్, మహబూబాబాద్, నర్సంపేట, ములుగు, పినపాక, ఇల్లెందు, భద్రాచలం అసెంబ్లీ నియోజకవర్గాలున్నాయి. ఈ లోక్‌సభ స్థానం పరిధిలో ఇప్పటి వరకు మూడుసార్లు ఎన్నికలు జరగ్గా ప్రధాన రాజకీయపక్షాలు తమ సామాజిక వర్గానికి సముచిత ప్రాధాన్యం ఇవ్వకపోవడం పట్ల ఆదివాసీ సంఘాల నాయకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఈసారి జరిగే పార్లమెంట్ ఎన్నికల్లో ప్రధాన రాజకీయ పార్టీలు తప్పకుండా తమ ప్రతిపాదనను పరిగణలోకి తీసుకోవాలని సూ చిస్తున్నారు. ఈ క్రమంలో మహబూబాబాద్ లోక్‌సభ స్థానం ఆదివాసీ అభ్యర్థిని ప్రకటించే విషయంలో వివిధ రాజకీయ పార్టీలు ఏం నిర్ణయం తీసుకుంటాయనేది వేచి చూడాల్సి ఉంది.

అక్రమంగా తరలిస్తున్న గంజాయి పట్టివేత


వివరాలు వెల్లడిస్తున్న ఇల్లెందు ఎక్సైజ్ అధికారులు

చంద్రుగొండ, జనవరి 18: గంజాయిని తరలిస్తు ఇద్దరు వ్యక్తులను పోలీసులు అరెస్ట్ చేశారు. ఈమేరకు జూలూరుపాడు సీఐ శ్రీనివాస్ ఇందుకు సంబంధించిన వివరాలను గురువారం చంద్రుగొండ పోలీసుస్టేషన్‌లో వెల్లడించారు. నిందితుల నుంచి స్వాధీనం చేసుకున్న 8.15 కిలోల గంజాయి ప్యాకెట్లను విలేకరులకు చూపించారు. జూలూరుపాడు ఎస్ఐ పురోషోత్తం అదనపు విధుల్లో భాగంగా చంద్రుగొండలో పెట్రోల్ బంక్ వద్ద సిబ్బందితో కలిసి వాహనాలు తనిఖీ చేస్తున్నారు. ఈ క్రమంలో కొత్తగూడెం వైపు నుంచి తిరువూరు వైపు ద్విచక్ర వాహనంపై వెళుతున్న ఇద్దరు వ్యక్తులను తనిఖీ చేశారు. ఈ తనిఖీలో వారి వద్ద గంజాయి ప్యాకెట్లు లభించాయి. వీరిని స్టేషన్‌కు తరలించి విచారించగా ఆంధ్రప్రదేశ్‌లోని పులివెందులకు చెందిన గణేష్, చిత్తూరుకు చెందిన సంతోష్‌లుగా తేలిందన్నారు. సీలేరు నుంచి చిత్తూరుకు తీసుకుపోతున్నట్లు సీఐ తెలిపారు. దీని విలువ రూ 1.60 లక్షలు ఉంటుదన్నారు. వాహనం సీజ్ చేసి, నిందితులను కొత్తగూడెం కోర్టుకు తరలించామని తెలిపారు. ఈ సమావేశంలో జూలూరుపాడు ఎస్ఐ పురోషోత్తం, సిబ్బంది పాల్గొన్నారు.

● ఇల్లెందురూరల్, జనవరి 18: ఆంధ్రా నుంచి తెలంగాణకు మోటర్ సైకిల్‌పై తరలిస్తున్న ఎండు గంజాయిని గురువారం ఎక్సైజ్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ సర్వేశ్వర్‌రావు, ఇల్లెందు ఎక్సైజ్ సీఐ రాంప్రసాద్ తెలిపిన వివరాల మేరకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం సీలేరు నుంచి మోటర్ బైక్‌లో యాదా ద్రి భువనగిరి జిల్లా బీబీనగర్‌కు ఐదున్నర కిలోల ఎండు గంజాయిని తరలిస్తుండగా ఇల్లెందు మండలం బొజ్జాయిగూడెం సమ్మక్క-సారలమ్మ గద్దెల వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. పట్టుబడ్డ గంజాయి విలువ సుమారు లక్ష యాభైవేలు ఉంటుందని వివరించారు. ఎండు గంజాయిని రవాణా చేస్తున్న బీబీనగర్‌కు నందగిరి వరుణ్, ములిగొండ మల్లేషం అను ఇరువురుని అదు పులోకి తీసుకున్నట్లు వారు తెలిపారు. దాడుల్లో సిబ్బంది ఎస్ఐలు ముబాషిర్ అహ్మద్, రమాదేవి, సమిఉల్లాఖాన్, గోవర్ధన్, సిబ్బంది రవిబాబు, వెంకట్, హరిష్, హన్మంతరావు, విజయ్, తులిస్య ఉన్నారు.

ఇంటర్ విద్యార్థుల మధ్యాహ్నభోజనానికి
దాతల చేయూత

కల్లూరు, జనవరి 18: కల్లూరులోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజన అమలుకు గానూ ఆ కళాశాల పూర్వ విద్యార్థులు చేయూత నిచ్చేందుకు ముందుకు వచ్చారు. గురువారం కళాశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో 1977- 79కు చెందిన నాటి బ్యాచ్‌కు చెందిన (ఇంటర్) పూర్వ విద్యార్థులు పసుమర్తి వెంకటేశ్వరరావు, దోసపాటి భాస్కరావు, ఎస్‌కే ఇస్మాయిల్‌తో పాటుగా మిత్ర బృందం దాతృత్వం చాటుకునేందుకు ముందుకు వచ్చారు. ఈ కళాశాలలో ఇంటర్ ప్రథమ, ద్వితీయ చదువుతున్న 200 మంది విద్యార్థులకు ఈ నెల 20 నుంచి పరీక్షలు ముగిసే వరకు భోజనం అందించేందుకు ముందుకు వచ్చారు. ఈసందర్భంగా దాతలను కళాశాల ప్రిన్సిపాల్, విద్యార్థులు అభినందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కుతంబాక శ్రీనివాసరావు, అధ్యాపకులు ఎస్‌కే అతహర్‌అలి, శ్రీహరి, తిరుపతిరావు, ప్రమీల, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

చిన్నారి వైద్యానికి ఎల్‌వోసీ అందజేత


బాధిత బాలిక కుటుంబసభ్యుడికి ఎల్‌వోసీ లేఖను అందజేస్తున్న తుమ్మల

రఘునాథపాలెం, జనవరి 18: అనారోగ్యంతో బాధపడుతన్న చిన్నారికి రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అండగా నిలిశారు. రఘునాథపాలెం మండలం గణేశ్వరంలో అనారో గ్యానికి గురైన అజ్మీరా చిన్న ప్రసాద్ కుమార్తె లాస్యశ్రీకి వైద్యసేవల కోసం ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కాంగ్రెస్ నాయకుల ద్వారా విషయం తెలుసుకున్న రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు లాస్యశ్రీకు రూ.2.5 లక్షల ఎల్‌వోసీ లేఖను మంజూరు చేయించి గురువారం హైదరాబాద్‌లో బాధిత కుటుంబ సభ్యులకు అందించారు.

లక్ష్యంపై క్రీనీడ



ఖమ్మం రూరల్‌మండలంలోని చిన్న వెంకటగిరి గ్రామంలో ఖమ్మం-కోదాడ ప్రధాన రహదారి పక్కన మహాత్మాగాంధీ ఉపాధి హామీ నిధులు సుమారు రూ.5 లక్షలతో నిర్మించిన తెలంగాణ క్రీడా ప్రాంగణం వెలవెబోతోంది. బాధ్యుల పర్యవేక్షణ లోపంతో ప్రభుత్వ లక్ష్యం ముళ్లపొదల పాలైంది.



- స్టాఫ్ ఫొటోగ్రాఫర్, ఆంధ్రజ్యోతి, ఖమ్మం

ఆంధ్రజ్యోతి క్లిక్

తూర్పు నుంచి పడమరకు..

ఉదయం



జనవరి మాసం చలిలో నులివెచ్చని కిరణాలతో అల్లంత దూరాన ఉన్న తూరుపు కొండల మీదుగా ఎగబాకిన సూరీడు రోజంతా వెలుగులు విరజిమ్మి.. సాయంకాలం కాగానే పడమరకు చేరి చెట్ల మాటున విశ్రాంతి కోసం ఎర్రబారే దృశ్యాలు ప్రకృతి ప్రేమికులను అమితంగా ఆకట్టుకుంటాయి. సరిగ్గా ఇలాంటి చిత్తరువులే వైరా మండల కేంద్రంలో గురువారం కనువిందు చేశాయి.

-వైరా

సాయంత్రం





ముదిగొండలో కోతుల గుంపులు

రైతుల కష్టం కోతుల పాలు

- గ్రామాల్లో స్వైరవిహారం చేస్తున్న వానరాలు
- పంటలను ధ్వంసం చేస్తున్న వైనం
- లబోదిబోమంటున్న రైతులు



కోతులను తరిమే యత్నం

ముదిగొండ, జనవరి 18: రైతులను వానరాలు నట్టేట ముంచుతున్నాయి. పంటలను ధ్వంసం చేస్తుండటంతో పరిస్థితి దయనీయంగా మారింది. ముదిగొండ మండలంలో కోతుల స్వైరవిహారంతో ప్రజలే కాకుండా రైతులు తీవ్ర ఇబ్బందులనెదుర్కొంటున్నారు. అడవుల్లో ఉండాల్సిన కోతులు గ్రామాల్లోకి ప్రవేశించి దాడులకు పాల్పడుతుండటంతో రైతులు భయాందోళనలకు గురవుతున్నారు. రైతుల పంటపొలాలపై సైతం గుంపులుగుంపులుగా దాడులు చేసి పంటలను ధ్వంసం చేస్తున్నాయి. వర్షాభావం వల్ల పత్తి, మిర్చి పంటలు పండక ఇబ్బందులు పడుతుంటే వాటిని దున్ని మొక్కజొన్న సాగు చేపడితే పంట చేతికొచ్చే దశలో కోతులు పంటను ధ్వంసం చేస్తున్నాయి. కోతులను తరిమే ప్రయత్నంలో రైతులపై కూడా కోతులు దాడులకు పాల్పడుతున్నాయి. కోతులను తరిమేందుకు ఎలాంటి ప్రయత్నాలు చేసినప్పటికీ ప్రయోజనం ఉండటం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కోతుల బెడదను అరికట్టాలని రైతులు కోరుతున్నారు.

మొక్కజొన్న పంటను కోతులు ధ్వంసం చేశాయి
పుచ్చకాయల రామయ్య, కౌలురైతు, ముదిగొండ



నాలుగెకరాలను కౌలుకు తీసుకొని మొక్కజొన్న పంట సాగుచేశాను. ఇప్పటికీ ఎకరాకు రూ.30వేల పెట్టుబడి అయింది. పంట ఇంకో 20రోజుల్లో చేతికి వస్తుందని ఆశగా ఎదురుచూస్తున్న తరుణంలో గుంపులుగుంపులుగా కోతులు తమ పంటను ధ్వంసం చేస్తున్నాయి.

మహిళల స్వావలంబన సౌధం

ఇందిరా డెయిరీ

- దేశంలోనే పెద్ద పాలకేంద్రం ఏర్పాటుకు ఉప ముఖ్యమంత్రి శ్రీకారం
- మహిళలను వాటాదారులుగా చేర్చి లాభాలను పంచడమే లక్ష్యం
- నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పన.. ఆర్థిక తోడ్పాటు
- మధిరలో పైలట్ ప్రాజెక్టు...ఆ తరువాత విస్తరణ
- బోనకల్‌కు రాష్ట్రస్థాయిలో గుర్తింపు దిశగా అడుగులు

బోనకల్, జనవరి 18: దేశంలోనే పెద్ద డెయిరీని మధిర నియోజకవర్గంలోని బోనకల్‌లో ఇందిరా డెయిరీ పేరుతో ఏర్పాటు చేసేందుకు డిప్యూటీ సీఎం మల్లు భట్టీ విక్రమార్క శ్రీకారం చుట్టారు. పాలన పగ్గాలు చేపట్టిన కొద్ది రోజుల్లోనే ఆయన ఇందిరా డెయిరీ పై దృష్టి సారించారు. డెయిరీ ఏర్పాటుకు సంబంధించి మధిర నియోజకవర్గంలో పర్యటించిన రెండు పర్యాయాలు అధికార యంత్రాంగానికి పలు సూచనలు చేశారు. ప్రత్యేకాధికారిని నియమించాలని ఆదేశాలను ఇచ్చారు. తాజాగా బోనకల్‌లో మంగళవారం రాత్రి నిర్వహించిన పౌరసన్మాన సభలో భట్టీ తన అంతరంగాన్ని ప్రజలకు వివరించారు. జాతీయ స్థాయిలో అతి పెద్ద డెయిరీని నియోజకవర్గంలో ఏర్పాటు చేసే పనిలో ఉన్నామని చెప్పడంతో భట్టీని పట్టువీడని పని విక్రమార్క డిగా ప్రజలు అభినందిస్తున్నారు.

వాటాదారులుగా మహిళలు

మధిర నియోజకవర్గంలో 61 వేల మంది డ్వాక్రా మహిళ లు ఉన్నారు. వీరందరిని వాటా దారులుగా చేర్చి లాభాలను పంచి పాడి పారిశ్రామికవేత్తలుగా మార్చడమే లక్ష్యం. ఇందుకు గానూ గత 2014లోనే ఇందిరా డెయిరీ ఏర్పాటుకు నాటి డిప్యూటీ స్పీకర్ హోదాలో మల్లు భట్టి విక్రమార్క బోనకల్‌లో శంకుస్థాపన చేశారు. 71సర్వే నంబర్‌లో గిరిజన రైతులకు ఇచ్చిన 9 ఎకరాల 24 కుంటల అసైన్డ్ భూమిని సేకరించారు. నాడు దాదాపు రూ.80 కోట్ల నిధులను మంజూరు చేయించినట్లు సమాచారం. నియోజకవర్గంలోని 5మండలాల్లోని 4133 మంది మహిళల నుంచి రూ. 36లక్షల వాటా ధనాన్ని వసూలు చేసి బ్యాంకులో డిపాజిట్ చేశారు. కొంత మంది మహిళలు రూ. 500, మరి కొంత మంది రూ. రూ.600 నుంచి రూ.1200 వరకు వాటాధనంగా ఇచ్చారు. డ్వాక్రా మహిళలు, జిల్లా అధికారులు, ప్రజా ప్రతినిధులతో కలిసి భట్టీ నాడు గుజరాత్ రాష్ట్రంలోని అమూల్ డైయిరీని సందర్శించి అక్కడ నిర్వహణను పరిశీలించారు. మధిరలో ఇందిరా పాడి పరిశ్రమ సహకార సంఘం పేరిట సొసైటీని రిజిస్టర్ చేయించి కార్యాలయాన్ని, ప్రత్యేకాధికారిని ఏర్పాటు చేశారు. ఇంతలో తెలంగాణా రాష్ట్ర సాధనతో పాటు బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఈ ప్రాజెక్టు కార్యరూపం దాల్చలేదు.



ఇందిరా డెయిరీ కార్యాలయంలో భట్టి(ఫైల్)



గుజరాత్‌లోని అమూల్ డెయిరీని సందర్శించిన భట్టి, అధికారులు(ఫైల్)

యువతకు ఉపాధి కల్పన, ఆర్థిక తోడ్పాటు

డ్వాక్రా గ్రూపులో ఉన్న మహిళలకు పాడి గేదెలను ఇచ్చి పాలను ఇందిరా డెయిరీ సేకరిస్తుంది. పాల మార్కెటింగ్‌తో పాటు పాల ఉత్పత్తులను విక్రయించడం ప్రస్తుత అమూల్ కంపెనీకి మించి ఉంటుంది. వ్యవసాయం పై ఆధారపడిన నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు మెండుగా ఉంటాయి. పాడి ఉత్పత్తి కొరకు పశువులకు కావాల్సిన పచ్చి, ఎండు గడ్డి, దాణాను పాడి రైతుల ఇళ్లకు వెళ్లి సరఫరా చేసే పనులు ఉంటాయి. మండలాల్లో గ్రామాలను కొన్ని యూనిట్లుగా విభజించడంతో పాటు రుణాలు ఇచ్చి వాహనాలు, గడ్డి కటింగ్, దాణా మిక్సింగ్ యంత్రాలను సమకూర్చుతారు. ప్రతి మండలంలో వెటర్నరీ అంబులెన్స్ లను ఏర్పాటు చేసి వైద్య సేవలు అందించడం, తదితర పనులు చేస్తారు. మహిళలతో పాటు నిరుద్యోగ యువతక ఆర్థిక తోడ్పాటుకు పలు పనుల నిర్వహణ ఉంటుంది.

మధిరలో పైలట్ ప్రాజెక్టు.. ఆ తరువాత విస్తరణ

డిప్యూటీ సీఎం మల్లు భట్టీ విక్రమార్క తన కలల ప్రాజెక్టు ఇందిరా డెయిరీని ముందుగా మధిర నియోజకవర్గంలో పైలట్ ప్రాజెక్టుగా ప్రారంభిస్తారు. సాధ్యమైనంత తొందరగా ప్రాజెక్టును పూర్తి చేసేందుకు కసరత్తు చేస్తున్నారు. నియోజకవర్గంలోని మహిళలందరిని ఇందులో బాగస్వామ్యులుగా ఉండేలా చూడాలని అధికారులకు దిశానిర్ధేశం చేశారు. మధిర తరువాత రాష్ట్రమంతా ప్రాజెక్టు విస్తరణ ఉంటుందన్న చర్చ జరుగుతోంది. బోనకల్‌లో ఇందిరా డెయిరీ ఏర్పాటుకు మార్గం సుగమం కావడంతో రాష్ట్ర వ్యాప్తంగా బోనకల్‌కు తగిన గుర్తింపు లభిస్తుందని మండల ప్రజలు సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు. ప్రాజెక్టు కార్యరూపం దాల్చితే రోడ్లు, సౌకర్యాలు, భూములకుమంచి ధరలు, మండలం అత్యంత అభివృద్ధి పథంలో నిలుస్తుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

పశుగ్రాసానికి యమా గిరాకీ

వైరా, జనవరి 18: వైరా ప్రాంతంలో ఈ ఏడాది పశుగ్రాసానికి యమా గిరాకీ ఏర్పడింది. గడిచిన వర్షాకాల సీజన్‌లో తీవ్ర వర్షాభావం వలన ఎన్నెస్పీ ఆయకట్టులోని లక్షలాది ఎకరాల్లో వరిసాగు జరుగలేదు. అలాగే నీటి లభ్యత లేని కారణంగా వాగులు, వంకల కింద కూడా రైతులు పంటలు వేయలేదు. ఫలితంగా తీవ్ర పశుగ్రాసం కొరత ఏర్పడింది. వైరా రిజర్వాయర్ ఆయకట్టులో మాత్రం అనేక ఒడిదుడుకుల మధ్య వరిసాగు జరిగింది. దాంతో ఇతర ప్రాంతాల రైతులు ఇక్కడి పశుగ్రాసం కోసం ఎగబడ్డారు. ఫలితంగా పశుగ్రాసానికి గిరాకీ పెరిగింది. మిషన్‌తో కోసి పొలంపై ఉన్న వరిగడ్డిని మళ్లీ మరో మిషన్‌తో ఒక వరిగడ్డి కట్ట కట్టినందుకు రూ.30ను రైతు చెల్లిస్తున్నారు. ఇతర ప్రాంతాల రైతులకు ఒక్క వరిగడ్డి కట్టను రూ.60నుంచి రూ.70వరకు విక్రయిస్తున్నారు. వైరా ఆయకట్టు రైతులు తమ అవసరాల కోసం ఇంటికి తీసుకువెళ్తున్న వరిగడ్డి కట్టకు మిషన్ కోసం రూ.30ఖర్చు చేస్తున్నారు. ఇతర ప్రాంతాల రైతులకు విక్రయించిన గడ్డి కట్ట ఒక్కింటికి రూ.60నుంచి రూ.70వసూలు చేస్తున్నారు. ఇదే అదునుగా మరికొంతమంది గడ్డి వ్యాపారులు కూడా ఇక్కడ బారులుతీరుతున్నారు. ఇతర ప్రాంతాలకు తరలించి అక్కడ ఒక వరిగడ్డి కట్టను రూ.90నుంచి రూ.100వరకు విక్రయించి సొమ్ముచేసుకుంటున్నారు. మొత్తంగా వైరా ప్రాంతంలో పశుగ్రాసానికి విపరీతమైన గిరాకీ ఏర్పడింది.



పొలాల్లో మిషన్‌తో వరిగడ్డి కట్టలు కట్టిన దృశ్యం

ఎగుడు దిగుడుగా రాష్ట్రీయ రహదారి

- పొంచి ఉన్న ప్రమాదం
- నిర్మాణ లోపమే ప్రధాన కారణం

కల్లూరు, జనవరి 18: కల్లూరు పట్టణంలోని రాష్ట్రీయ ప్రధాన రహదారి ఎగుడు దిగుడుగా మారటంతో వాహనాదారులకు ప్రమాదకరంగా మారింది. గత ఏడాది క్రితం ఈ రహదారి నిర్మాణ పనుల్లో బీటీ పరిచినప్పుడు సరిగా పనులు చేయకపోవడంతో లోపభూయిష్టంగా మారింది. సదరు పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్ పాత బస్సుస్టాండు నుంచి మెయిన్ సెంటర్ మీదగా టీటీడీ కళ్యాణ మండపం వరకు ఈ రోడ్డుపై తారువేసే సమయంలో యంత్రాలతో సమాతంరంగా బీటి పరచక ఎగుడు దిగుడుగా తయారైంది. దీంతో ద్విచక్ర వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. కల్లూరు పట్టణంలో జనసంచారం అధికంగా ఉంటే ప్రదేశంలోనే ఈ పరిస్థితి దాపురించింది. ఇలా కిమీ పొడవున రహదారి ఎగుడు దిగుడుగా ఖమ్మం వైపున వెళ్లేటపుడు(ఎడమ) సమాతంరంగా లేని పరిస్థితి. అధికారులు స్పందించి ఈ రహదారిపై ఏర్పడిన ఎగుడు దిగుడు తోపాటుగా, గుంతలను కూడా పూడ్చేలా అధికారులు దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.



దిగుడుగా ఉన్న రాష్ట్రీయ ప్రధాన రహదారి

ఆగని రైళ్లు.. అభివృద్ధికి మాత్రం కోట్లు

- రూ.25 కోట్లతో మధిర రైల్వేస్టేషన్ ఆధునికీకరణ పనులు
- సౌకర్యాలు కాదు.. ప్రయాణ సౌలభ్యం కావాలంటున్న ప్రజలు
- కొవిడ్ నుంచి వరుసగా రైళ్ల హాల్టింగ్ ఎత్తివేత





మధిర రైల్వేస్టేషన్‌లో జరుగుతున్న ఆధునికీకరణ పనులు

మధిరటౌన్, జనవరి18: ఒక ప్రక్క పెరిగిన జనాభాకి, ప్రయాణానికి అనుగుణంగా రైళ్లను నడపాల్సిన రైల్వే శాఖ ఉన్న రైళ్లను ఎత్తివేసే కార్యక్రమానికి వరుసగా శ్రీకారం చుట్టింది. మధిర రైల్వే స్టేషన్ మధిర చుట్టుపక్కల గ్రామాల ప్రజలతో పాటు ప్రక్కన ఉన్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని 21 గ్రామాలకు కూడా రైల్వే ప్రయాణానికి ఎంతో అనువైన ప్రాంతం. కొవిడ్ సమయంలో అనేక రైళ్లను రద్దుచేసిన రైల్వే శాఖ కొవిడ్ తగ్గిన తరువాత కూడా రైళ్లను పునరుద్ధరించక పోగా మరికొన్ని రైళ్లకు కూడా హాల్టింగ్ ఎత్తివేసింది. కాగా ఇటీవల కేంద్రం అమృతభారత్ స్టేషన్ కింద మధర రైల్వేస్టేషన్ ను ఎంపిక చేసింది. ఈ పథకం కింద మధిర రైల్వేస్టేషన్ అభివృద్ధికి రూ.25 కోట్లు మంజూరు చేసి పనులు చేస్తున్నారు. మధిరలో నవజీవన్, ఈస్ట్‌కోస్ట్ రైళ్ల హాల్టింగ్ కోసం ఎన్నో ఏళ్లనుంచి విజ్ఞప్తులు చేస్తున్నా పట్టించుకోని రైల్వే, ఎవరూ అడగక పోయినా నిధులు మాత్రం ఖర్చు చేస్తోందని ప్రయాణికులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికే సింహపురి, లింక్, గౌతమి ఎక్స్‌ప్రెస్ రైళ్ల స్టాపింగ్‌ను ఎత్తివేసిన అధికారులు ఒక ప్యాసింజర్‌ను పూర్తిగా రద్దుచేశారు.

రైళ్లు కూడా కావాలి
పుతుంబాక కృష్ణప్రసాద్, ప్రయాణికుల సంఘం అధ్యక్షుడు



ఎన్నో ఏళ్లగా అనేక రైళ్లకు హాల్టింగ్ కావాలని కోరుతున్నా రైల్వే శాఖ పట్టించుకోవటం లేదు. గతంలో మధిర లో ఆగే రైళ్లకు హాల్టింగ్ ఎత్తివేశారు. వాటికి వెంటనే హాల్టింగ్ కల్పించాలి. రైళ్లు ఆగితేనే ప్రయాణికులు స్టేషన్‌కు వస్తారు. రైళ్లు లేకుండా ప్రయాణికులు వేచి ఉండేందుకు అనేక గదులు నిర్మిస్తే మాత్రం ఏమి ఉప యోగం. వెంటనే ఈ విషయాన్ని అధికారులు పరిశీలించి రైళ్లను ఆపాలి.

కుష్టు రహిత సమాజానికి కృషిచేయాలి

- సర్వ్‌లైన్స్ డిప్యూటీ పీఎంవో సకలారెడ్డి

జూలూరుపాడు, జనవరి18: కుష్టురహిత సమాజ నిర్మాణం కోసం ప్రతి ఒక్కరు కృషిచేయాలని స్టేట్ కుష్టు వ్యాధి సర్వ్‌లైన్స్ డిప్యూటీ పీఎంవో సకలారెడ్డి తెలిపారు. గురువారం జూలూరుపాడులోని ప్రభుత్వ ఆసుపత్రిని సర్వ్‌లైన్స్ బృందం సందర్శించింది. ఈ సందర్భంగా కేసులకు సంబంధించిన రికార్డులు పరిశీలించారు. అనంతరం ఏఎన్ఎంలతో సమావేశాన్ని నిర్వహించి వ్యాధి లక్షణాలు, చికిత్స, నివారణ చర్యలపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ శరీరంపై మొద్దుబారిన మచ్చలను సకాలంలో గుర్తించి చికిత్స అందిస్తే అంగవైకల్యం రాకుండా పూర్తిగా రోగలక్షణాలను తగ్గించవచ్చని అన్నారు. ఎండీటీ కుష్టు వ్యాధిని పూర్తిగా నివారించవచ్చని, దీని వల్ల ఎటువంటి దుష్ప్రభావం ఉండదన్నారు. ఎండీటీ బాధితుల కు ఉచితంగా ఆరోగ్య ఉప కేంద్రాలలో వైద్యం అందించి మందులను ప్రభుత్వం పంపిణీ చేస్తుందన్నారు. గ్రామాల్లో వైద్య సిబ్బంది ఈ వ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పించా లని ఆయన కోరారు. ఈ సమావేశంలో అసిస్టెంట్ డిప్యూటీ పీఎంవో ఐ వెంకటేశ్వరరావు, జి.గన్యా, వైద్యాధికారి రాకేష్, ప్రోగ్రామ్ నోడల్ పర్సన్ రత్నకుమార్, సూపర్ వైజర్లు రాధిక, సుభద్ర పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రాష్ట్ర అధికారి సకలారెడ్డి

పూసుగుంట రహదారిపై మంత్రి తుమ్మల నజర్

- నిలిచిన రోడ్డు పనుల ప్రారంభానికి చర్యలు
- నివేదికలు తెప్పించుకున్న మంత్రి



మధ్యలో నిలిచిపోయిన పూసుగుంట రహదారి(ఫైల్)

అశ్వారావుపేట, జనవరి 18: దమ్మపేట మండలంలోని మారుమూల కొండరెడ్ల గ్రామం పూసుకుంట రహదారి పనుల్లో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశాలతో కదలిక ఏర్పడింది. రోడ్డు పనులపై నివేదికలు ఇవ్వాలని ఆయన అధికారులను ఆదేశించారు. పూసుగుంట గ్రామానికి 2018లో రూ.1500కోట్లు కేంద్ర ప్రభుత్వ నిధులతో ఆనాటి ఆర్అండ్‌బీ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు శంకుస్థాపన చేసిన బీటీ రహదారి పనులు ఆ తరువాత అటవీశాఖ అభ్యంతరాలతో ఐదేళ్లుగా నిల్చిపోయాయి.

మంత్రి తుమ్మల కృషితో రూ.1500 కోట్లు

కొండరెడ్ల గ్రామమైన పూసుగుంటకు మండల కేంద్రమైన దమ్మపేటకు, జిల్లా కేంద్రమైన కొత్తగూడేనికి రవాణా సౌకర్యం కల్పించే పనుల్లో భాగంగా 5కి.మీ మేర బీటీ రహదారిని పూర్తి చేశారు. ఇంకా 10.5 కి.మీ. మేర బీటీ నిర్మించాల్సి ఉంది. ఈ సమయంలో అటవీశాఖాధికారులు ఈ రహదారి పనులకు అభ్యంతరం తెలిపారు. రహదారిలో కోల్పోయే అటవీ భూమికి బదులుగా రెవెన్యూశాఖ 10.3 హెక్టార్ల రెవెన్యూ భూమిని అటవీ శాఖకు అప్పగించింది. అయిన అటవీశాఖ అంగీకరించలేదు.

ఆగిన రోడ్డు పనులపై నివేదికలు కోరిన మంత్రి

ఆనాడు పూసుగుంట రహదారి పనులకు శంకుస్థాపన చేసిన మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మరోసారి కొత్త ప్రభుత్వంలో మంత్రి బాధ్యతల్లో ఉన్నారు. దీంతో అప్పుడు ఆయన హయాంలో ప్రారంభమై మధ్యలో ఆగిన పనులపై ఆయన దృష్టి పెట్టారు. ఆయన ఆదేశాలతో గత నెలలోనే అటవీ, ఆర్ అండ్‌బీ అధికారులు, ఐటీడీఏ పీవోతో ఉమ్మడి సర్వే చేశారు. జిల్లా కలెక్టర్ రెండు శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. పూసుకుంట రహదారి ఆగడంపై అభ్యంతరాలు, అనుమతులు, ప్రతిపాదనలపై మంత్రి తుమ్మల ఇరు శాఖల నుంచి నివేదికలను కోరారు. ఆయా శాఖల నుంచి నివేదికలు తీసుకొని ఉన్నతాధికారులకు పంపినట్లు సమాచారం.

వంతెనలకు అటవీశాఖ గ్రీన్‌సిగ్నల్

అధికారుల సమీక్షలో అటవీశాఖ అధికారులు రహదారి నిర్మాణానికి మరోసారి అభ్యంతరం వ్యక్తంచేసినట్లు తెలుస్తోంది. అయితే ఈ రహదారిపై రెండు వాగులపై ఐటీడీఏ నిధులతో మంజూరైన రెండు వంతెనలు రూ.1.30కోట్లు, రూ.1.32కోట్లతో మంజూరైన వాటిని నిర్మించుకోవటానికి తమకు ఎటువంటి అభ్యంతరం లేదని అటవీశాఖ తెలిపినట్లు రోడ్లు భవనాల శాఖ అధికారులు తెలిపారు. వీటన్నింటిపై తమ శాఖ ఉన్నతాధికారుల ద్వారా ప్రభుత్వానికి నివేదిక పంపనున్నట్లు అశ్వారావుపేట ఆర్అండ్‌బీ డీఈఈ శ్రీనివాసరావు తెలిపారు. నివేదికలు ప్రభుత్వానికి చేరిన తరువాత రహదారికి వచ్చిన అభ్యంతరాలను పరిష్కరించేందుకు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తగిన చర్యలు తీసుకుంటారని, ఐదేళ్లుగా నిలచిపోయిన పూసుకుంట రహదారికి మోక్షం కలుగుతుందని గ్రామస్థులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

ఇటుక దందా.. ఇష్టారాజ్యం

- అనుమతి లేకుండా ఐదేళ్లుగా బట్టీ నిర్వహణ
- అక్రమంగా విద్యుత్, చెరువు మట్టి, కలప వాడకం

రఘునాథపాలెం, జనవరి18: రఘునాథపాలెం మండలంలో ఇటుకల బట్టీలు 'మామూళ్ల'తో మండుతున్నాయి. ఖమ్మం నగరానికి సమీపంలో ఉండటంతో భవన నిర్మాణ పనులకు ఇటుకలు కావాలంటే ఖమ్మంలోని బిల్డర్లు, సొంత ఇంటి నిర్మాణదారులు రఘునాథపాలెం మండలం వైపు చూస్తారు. దీంతో మండలంలో ఇటుకల బట్టీ వ్యాపారం కనీస నిబంధనలు పాటించకుండా రోడ్ల వెంట యథేచ్ఛగా సాగుతోంది. చింతగుర్తి గ్రామంలోని ఓ ఇటుకల బట్టి ఇందుకు ఉదాహరణ. గత ఐదేళ్లుగా ఈ బట్టీకి విద్యుత్ సరఫరాకు అనుమతి లేదు. అయినా విద్యుత్ మోటర్లు, కార్మికులు రాత్రింబవళ్లు పని చేసేందుకు 14ట్యూబ్ లైట్లతో బట్టి నిర్వాహణ జరుగుతోంది. ఇటుకల బట్టీకి సమీపంలోనే ఉన్న గ్రామాల చెరువుల నుంచి పెద్దఎత్తున మట్టిని గుట్టలుగా ఏడాదికి సరిపోను ముందుగానే తరలించి నిల్వ చేస్తున్నారు.



పనిచేస్తున్న బాలకార్మికులు




అక్రమ ఇటుక బట్టీ



అటవీ ప్రాంతం నుంచి తీసుకొచ్చిన కలప

మండలంలో ఉన్న అటవీ ప్రాంతాల నుంచి కలపను సేకరించి బట్టీల్లో వాడుతున్నారు. స్థానికంగా కూలీలు అందుబాటులో లేక పోవటంతో ఇతర రాష్ట్రాల నుంచి కూలీలను తీసుకొచ్చారు. బట్టి వద్దనే ఆవాసాలు ఏర్పాటు చేసి ఆయా కుటుంబాల్లోని పెద్దలు, చిన్నారులతో ఇటుకలు తయారీ చేయిస్తున్నారు. అయితే ఐదేళ్లుగా ఈ తంతు సాగుతున్నా పెద్దల ఆశీస్సులు పుష్కలంగా ఉండటంతోనే అధికారులు అధికారులు చర్యలకు వెనకాడుతున్నారనే విమర్శలు వస్తున్నాయి. ఈ విషయంపై విద్యుత్ ఏడీఈ సంజీవరావును 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా విద్యుత్ అనుమతి లేదని వెంటనే విద్యుత్ కనుక్షన్ తొలగించి కేసు నమోదు చేస్తామని అన్నారు. ఇరిగేషన్ డీఈ 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ విచారణ చేపడుతామని అన్నారు. ఎంపీవో శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ఇటుకల బట్టి నిర్వాహణ తన దృష్టికి రాలేదన్నారు. విచారణ చేస్తామన్నారు.

ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి

ఖమ్మం
ఖమ్మం, పాలేరు, మధిర, వైరా, సత్తుపల్లి

శుక్రవారం 19 జనవరి 2024

ఆస్తిపన్ను వసూళ్లను వేగవంతం చేయాలి

కమిషనర్ ఆదర్శ్‌సురభి

ఖమ్మంకార్పొరేషన్, జనవరి18: ఆస్తిపన్నుల వసూళ్లను వేగవంతం చేయాలని నగరపాలకసంస్థ కమిషనర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. గురువారం నగరపాలకసంస్థ కార్యాలయంలో ఆర్‌ఐలు, బిల్‌కలెక్టర్లతో పన్నుల వసూళ్లపై సమీక్షా సమావేశం నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ ప్రతీ బిల్‌కలెక్టర్ తిరిగి నిర్వహించే సమావేశంలోపు తమకు ఇచ్చిన టార్గెట్‌లో 10శాతం వసూలు చేయాలన్నారు. భారీగా బకాయిలు పడ్డవారికి వెంటనే రెడ్‌నోటీసులు ఇవ్వాలని ఆదేశించారు. బిల్‌కలెక్టర్లు క్షేత్రస్థాయిలో పర్యటించి, రోజుకు 20అండర్ అసెస్‌మెంట్లు చేయాలన్నారు. అలాగే పంపుపన్ను కూడా తప్పనిసరిగా వసూలు చేయాలన్నారు. బిల్‌కలెక్టర్లు తమకు ఇచ్చిన లక్ష్యాన్ని పూర్తిచేయకున్నా, విధుల విషయంలో నిర్లక్ష్యం వహించినా చర్యలు తప్పవని కమిషనర్ హెచ్చరించారు.

ఎన్టీఆర్‌కు ఘన నివాళి

ఖమ్మం,మామిళ్లగూడెం, జనవరి18: తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారకరామారావు 28వ వర్థంతి గురువారం జిల్లావ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. టీడీపీ జిల్లా పార్టీ ఆధ్వర్యంలో ఖమ్మంలో టీడీపీ పార్లమెంటరీపార్టీ ప్రధాన కార్యదర్శి కేతినేని హరీష్, మల్లెంపాటి అప్పారావు, వడ్డెం విజయ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఇందిరానగర్ మైసమ్మ గుడి వద్ద ఏర్పాటు చేసిన ఎన్టీఆర్ చిత్రపటానికి పార్లమెంట్ పార్టీ అధ్యక్షుడు వాసిరెడ్డి రామనాథం, మల్లెంపాటి అప్పారావు, కొండబాల కరుణాకర్ నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో పులిపాటి ప్రసాద్, జట్ల శ్రీనివాసరావు, నాగార్జునపు శ్రీను, చుండూరు రాజరాజేశ్వరి, ఉప్పెర్ల వెంకటేశ్వర్లు, గడిపూడి వెంకటేశ్వర్లు, మారుకొండ కిషన్‌నావు, రాయల కోటేశ్వరరావు, పద్మనాబుల నారాయణరావు, పాలడుగు కృష్ణప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. ఖమ్మం నగరకమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో వాసిరెడ్డి రామనాధంతో పాటు కూరపాటి వెంకటేశ్వర్లు, వడ్డెం విజయ్ పాల్గొన్నారు. కాల్వొడ్డులోని ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. జిల్లా పార్టీ నాయకులు సీతయ్య, వడ్డెం విజయ్, ప్యారీస్ వెంకన్న, గుండెపిన్ని నాగేశ్వరరావు, నల్లమల రంజిత్, సానబోయిన శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. ఎన్టీఆర్ సర్కిల్‌లో నందమూరి విగ్రహానికి టీడీపీ నాయకులు కేతినేని హరీస్ నివాళులు అర్పించారు. అన్నదానం కార్యక్రమాన్ని చేపట్టారు. అనంతరం ఎన్టీఆర్ గీతాలాపనతో సంగీత విభావరిని నిర్వహించారు. ఎన్టీఆర్ పాత చిత్రాల పాటలు ఆహూతులను కట్టిపడేశాయి.



లకారం ట్యాంక్‌బండ్‌పై ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులు అర్పించిన మేయర్, కార్పొరేటర్లు, వైరాలో..



హైదరాబాద్‌లో నివాళులర్పిస్తున్న వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్, సత్తుపల్లిలో ఎమ్మెల్యే రాగమయి..


కల్లూరులో..


నామ ముత్తయ్య ట్రస్ట్ ఆధ్వర్యంలో అన్నదానం




ఖమ్మంలో అన్నదానం చేస్తున్న టీడీపీ నాయకులు, నివాళులు అర్పిస్తున్న పువ్వాళ్ల, జావీద్, నేలకొండపల్లిలో..


ముదిగొండలో పండ్లు పంపిణీ చేస్తున్న దృశ్యం


మధిరలో..


తిరుమలాయపాలెంలో..


కొణిజర్లలో..


కామేపల్లిలో అన్నదానం..


తల్లాడలో ...


వేంసూరులో...


ఏన్కూరులో...


ఎర్రుపాలెంలో..

ప్రభుత్వ స్థలాలను ఆక్రమిస్తే చర్యలు తప్పవు

కలెక్టర్ గౌతమ్

ఖమ్మంకలెక్టరేట్, జనవరి18: ప్రభుత్వ స్థలాల పరిరక్షణ దిశగా జిల్లా యంత్రాంగం కృషిచేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ వీపీ గౌతమ్ అన్నారు. ప్రభుత్వ స్థలాలు రికార్డుల్లో ఉన్న స్థలాల ఆక్రమణలు జరక్కుండా చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన తెలిపారు. నగరంలోని ఖానాపురం లకారం ట్యాంక్ బండ్ వద్ద సర్వే నెంబర్ 94లో 4.08 ఎకరాల స్థలాన్ని జిల్లా ఉద్యానవన శాఖకు కార్యాలయం భవనం రైతుశిక్షణ కేంద్రానికి 2009లో కేటాయించినట్లు ఆ స్థలాన్ని ఉద్యానవనశాఖ ఏలాంటి నిర్మాణాలు చేపట్టకుండా ఖాళీగా ఉంచినట్లు తెలిపారు. ఈ స్థలాన్ని ఆక్రమించుకుని బి.వీరారెడ్డి, రాంరెడ్డి నిర్మించిన షెడ్లను తొలగించి ప్రభుత్వం స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే ఉపేక్షించేది లేదని సమగ్ర పరిశీలన చేసి చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని కలెక్టర్ గౌతమ్ హెచ్చరించారు.

పాఠశాల అభివృద్ధి పనులు వేగిరం చేయాలి

పాఠశాల అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ గౌతమ్ అధికారులను ఆదేశించారు. గురువారం తన క్యాంపు కార్యాలయంలో విద్యాసంస్థల్లో జరిగే అభివృద్ధి పనులపై సమీక్షించారు. టాయిలెట్స్ బ్లాకుల మిగులు పనులు వెంటనే పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలన్నారు. ఈ సమావేశంలో డీఈవో సోమశేఖర శర్మ, సీపీవో శ్రీనివాస్, డీఐఈవో రవిబాబు, ఈఈ నాగశేషు, డీఈలు, ఏఈలు పాల్గొన్నారు.


అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్

పేద విద్యార్థినికి పరిశ సీతారత్నం ట్రస్ట్ ఆర్థికసాయం

కొణిజర్ల, జనవరి18: మండల పరిధిలోని తుమ్మలపల్లి గ్రామానికి చెందిన ఫార్మసీ విద్యార్థిని పందిళ్ల ఉషారాణికి పరిశ సీతారత్నం ట్రస్ట్ ద్వారా గురువారం రూ.20వేలు ట్రస్ట్ చైర్మన్ పరిశ పుల్లయ్య విద్యార్థినికి అందించారు. ఈ కార్యక్రమంలో ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు అజిత, సర్పంచ్ కమటాల రేణుక, మాజీ సర్పంచ్ కట్ల సత్యం, గడల శ్రీనువాసరావు, పుల్లారావు, అమూల్య పాల్గొన్నారు.

రహదారి విస్తరణకు మార్కింగ్

కామేపల్లి, జనవరి 18: కామేపల్లి మండల పరిధిలోని పండితాపురం, ముచ్చర్ల క్రాస్‌రోడ్, కొత్తలింగాల, తాళ్లగూడెం, కామేపల్లి క్రాస్‌రోడ్ సెంటర్లో ఇల్లందు-ఖమ్మం ప్రధాన రహదారి విస్తరించనున్నారు. ఈ మేరకు ఇరువైపులా 50అడుగుల మార్కింగ్‌ను గురువారం ఏర్పాటు చేశారు. మార్కింగ్ అనంతరం స్థలాన్ని వదిలి షాపులు ఏర్పాటు చేసుకోవాలని ఆర్‌ఎండ్‌బీ ఏఈ వరప్రసాద్ సూచించారు.

రోడ్డు భద్రత మనందరి బాధ్యత

వైరా, జనవరి18: రోడ్డు భద్రత మనందరి బాధ్యతని వైరా మోటారు వెహికిల్స్ ఇన్‌స్పెక్టర్ బాదావత్ శంకర్‌నాయక్ పేర్కొన్నారు. ఈనెల 15 నుంచి వచ్చేనెల 15వరకు నిర్వహించనున్న రోడ్డు భద్రతా వారోత్సవాల అవగాహన సదస్సును గురువారం వైరాలోని తమ క్యాంపు కార్యాలయంలో లారీ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. వారోత్సవాల వాల్‌పోస్టర్లను శంకర్ నాయక్ ఆవిష్కరించారు. అసోసియేషన్ అధ్యక్షుడు షేక్. బాబ్‌జానీ, సెక్రటరీ ముళ్లపాటి రంగారావు, ట్రెజరర్ షేక్.యాకోబ్ పాల్గొన్నారు.

పెనుబల్లి: రోడ్డుప్రమాదాలను అరికట్టేందుకు భద్రతా చర్యలు తీసుకోవాలని ముత్తగూడెం చెక్‌పోస్టు ఎంవీఐ విజయలక్ష్మీ సూచించారు. జాతీయ రోడ్డుభద్రతా వారోత్సవాల్లో భాగంగా గురువారం ముత్తగూడెం చెక్‌పోస్టు వద్ద ఎంవీఐ విజయలక్ష్మీ వాహనదారులకు అవగాహన కల్పించారు.

ఆక్రమిత భూములను పరిశీలించిన రేణుకాచౌదరి

ఖమ్మంసంక్షేమవిభాగం, జనవరి18: ఖమ్మంనగరంలో ఆక్రమణకు గురై తిరిగి ప్రభుత్వ అధికారులు స్వాధీనం చేసుకున్న భూములను కేంద్ర మాజీమంత్రి రేణుకాచౌదరి పరిశీలించారు. గురువారం ఖమ్మం పర్యాటనకు వచ్చిన ఆమెకు కాంగ్రెస్ నాయకులు ముస్తాఫాతో పాటుగా పలువురు ఈ ఆక్రమణను వివరించారు. స్పందించిన ఆమె ఖమ్మంనగరంలో రమణగుట్ట, బైపాస్‌రోడ్డు తదితర ప్రాంతాల్లో ఆక్రమిత భూములను పరిశీలించారు. ఖమ్మం ఏఎంసీ మాజీ చైర్మన్ మానుకొండ రాధాకిషోర్, నగర వర్కింగ్ ప్రెసిడెంట్ నాగండ్ల దీపక్‌చౌదరి, మాజీ కార్పొరేటర్ వడ్డెబోయిన నర్సింహారావు, పోటు లెనిన్ రేణుకా చౌదరి వెంటున్నారు. కాంగ్రెస్ జిల్లా నాయకులు శెట్టి రంగారావును కేంద్ర మాజీ మంత్రి రేణుకాచౌదరి పరామర్శించారు. రంగారావు సోదరుడు సుధాకర్ ఇటీవల అనారోగ్యంతో కన్నుమూశారు.


వివరాలు తెలుసుకుంటున్న కేంద్ర మాజీ మంత్రి

రేణుకాచౌదరిని కలిసిన 1998 క్వాలీఫైడ్ జిల్లా బాధ్యులు

కొణిజర్ల: కేంద్రమాజీ మంత్రివర్యులు రేణుకాచౌదరి గురువారం ఖమ్మం వచ్చిన సందర్భంగా 1998క్వాలీఫైడ్ సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బ్రహ్మదేవర వెంకన్న, కొనతం ఉమాశంకర్, బొగ్గారపు సతీష్, కూరపాటి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఆమెను కలిసి సమస్యలను వివరించిన్నట్లు జిల్లా కార్యదర్శి కొణిజర్లకు చెందిన కొనతం ఉమాశంకర్ తెలిపారు. దాంతో రేణుకాచౌదరి స్పందించారని, ఈనెల 24 తర్వాత హైదరాబాద్‌కు వస్తే సీఎంను కలిసి సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చిన్నట్లు ఆయన పేర్కొన్నారు.

తమ్మినేనిని పరామర్శించిన సీపీఎం నాయకులు

ఖమ్మంసంక్షేమవిభాగం, జనవరి18: హైదరాబాద్‌లో వైద్యసేవలు పొందుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రాన్ని జిల్లా సీపీఎం నాయకులు పరామర్శించారు. గురువారం ఖమ్మం నుంచి హైదరాబాద్‌లోని హాస్పటల్‌కు వెళ్లిన సీపీఎం నాయకులు వీరభద్రాన్ని కలుసుకున్నారు. రాష్ట్ర కమిటీ సభ్యులు పొన్నం వెంకటేశ్వరరావు, యర్రా శ్రీకాంత్, మాచర్ల భారతి, బండి రమేశ్, వై విక్రమ్, మాదినేని రమేశ్, మడుపల్లి గోపాల్‌రావు తమ్మినేనిని పరామర్శించిన వారిలో ఉన్నారు.

జడ్పీ పనులను పూర్తి చేయాలి

ఇంజనీరింగ్ అధికారులతో చైర్మన్ సమీక్ష

ఖమ్మంకలెక్టరేట్, జనవరి18: జిల్లా పరిషత్ సాధారణ నిధులతో చేపట్టిన అన్ని పనులను త్వరితగతంగా పూర్తి చేయాలని జిల్లా పరిషత్ చైర్మన్ లింగాల కమల్‌రాజ్ సూచించారు. గురువారం ఆయన తన ఛాంబర్‌లో పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారులతో సమీక్షించారు. ఇంకా ఇప్పటి వరకు పూర్తి కాని పనులు, ఇంకా మెదలు పెట్టని పనులు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈవో వింజం వెంకట అప్పారావు, డిప్యూటీ సీఈవో చంద్రశేఖర్, పంచయతీరాజ్ ఈఈ విఠల్, డీఈ కెవీకె శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్

చింతకాని,జనవరి18: స్థానిక పోలీస్ స్టేషన్‌లో గురువారం 10మంది రౌడీషీటర్లకు ఎస్‌ఐ ఆలకుంట రాజేందర్ కౌన్సిలింగ్ ఇచ్చారు. మండల పరిధిలోని 26 గ్రామ పంచాయతీలకు చెందిన రౌడీషీటర్లకు సత్ప్రవర్తనపై అవగాహన కల్పించారు.

తలనీలాలకు బహిరంగ వేలం పాటు

ఏన్కూరు,జనవరి18: మండలంలోని గార్లొడ్డు శ్రీలక్ష్మినర్సింహాస్వామి, నాచారం శ్రీ వెంకటేశ్వరస్వామి దేవలయంలో భక్తులు సమర్పించిన తలనీలాలను పోగు చేసుకునేందుకు 24న బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు ఈవో ఎన్.శేషయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 24న బుధవారం మధ్యాహ్నం 2గంటలకు ఖమ్మం కాల్వొడ్డులోని ఆంజనేయస్వామి దేవాలయంలో సహాయ కమిషనర్ సమక్షంలో వేలంపాటు నిర్వహిస్తామన్నారు.

నేటినుంచి న్యాయవాదులకు ఆటల పోటీలు

ఖమ్మంలీగల్, జనవరి18: రిపబ్లిక్ డేను పురస్కరించుకుని బార్‌అసోసియేషన్ క్రీడా కార్యదర్శి రావుల వెంకట్ ఆధ్వర్యంలో శుక్రవారం నుంచి న్యాయవాదులకు ఆటల పోటీలు నిర్వహిస్తామని క్రీడల కార్యదర్శి తెలిపారు. 19న కబాడీ, వాలీబాల్, చెస్, 21న క్రికెట్, 22న బాల్ బ్యాట్ మెంటన్,షటిల్, అథ్లెటిక్స్‌పోటీలు నిర్వహిస్తామన్నారు.

21న నెలనెల వెన్నెల

ఖమ్మంసాంస్కృతికం, జనవరి18: ఖమ్మంలోని భక్తరామదాసు కళాక్షేత్రంలో ప్రతినెలా నిర్వహించే నెలనెల వెన్నెల ఈనెల 21న జరుగు తుందని నిర్వాహకులు ఏఎస్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలో భాగంగా నాన్నా.. నేనొచ్చేస్తా నాటిక ప్రదర్శిస్తారని తెలిపారు.

సూరయ్య కుటుంబానికి కూనంనేని పరామర్శ

కొణిజర్ల, జనవరి18: మండల పరిధిలోని తనికెళ్ల గ్రామానికి చెందిన కొనపర్తి సూరయ్య ఇటీవల మృతి చెందారు. గురువారం సంస్మరణ సభకు కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు హాజరయ్యారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు.

సీజన్ ముగిసేవరకు పత్తిని కొనాలి

తల్లాడ, జనవరి18: తల్లాడలో ఉన్న సీసీఐ కొనుగోలు కేంద్రంలో సీజన్ ముగిసేవరకు పత్తిని కొనుగోలు చేయాలని రైతుసంఘం జిల్లా అధ్యక్షుడు మాదినేని రమేష్ డిమాండ్ చేశారు. గురువారం దొడ్డా కృష్ణయ్య భవనంలో కల్యాణపు కృష్ణయ్య అధ్యక్షతన రైతుసంఘం సమావేశంలో మాట్లాడారు.

హెచ్‌ఐవీపై కళాజాతా

తల్లాడ, జనవరి18: హెచ్‌ఐవీ పట్ల అవగాహన కల్పిస్తూ గురువారం తల్లాడ బస్టాండ్లో కాంపాటి శ్రీను ఆధ్వర్యంలో కళాబృందం కళాప్రదర్శనలు నిర్వహించారు. హెచ్‌ఐవీ రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు.

నగరంలో వికసిత్ భారత్ కార్యక్రమం

ఖమ్మంబైపాస్‌రోడ్, జనవరి18: రైల్వేస్టేషన్ వద్ద బీజేపీ, జిల్లాలీడ్‌బ్యాంక్ మేనజర్ ఏఎస్‌రెడ్డి ఆధ్వర్యంలో వికసిత్‌భారత్ కార్యక్రమం గురువారం నిర్వహించారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు గల్లా సత్యనారాయణ వికసిత్‌భారత్ క్యాలెండర్ ఆవిష్కరించారు.

అద్దంకి దయాకర్‌కు ఎమ్మెల్సీగా అవకాశం కల్పించాలి

ఖమ్మంచర్చికాంపౌండ్, జనవరి18: అద్దంకి దయాకర్‌కు ఎమ్మెల్సీగా అవకాశం కలిపించి మంత్రి వర్గంలోకి తీసుకోవాలని జిల్లా యూనిటీ ఆఫ్ మాల జిల్లానాయకులు కోరారు. గురువారం నగరంలోని జడ్పీసెంటర్‌లోని అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. కాంగ్రెస్ పార్టీ విజయం కోసం కృషిచేసిన దయాకర్‌కు ఎమ్మెల్సీగా అవకాశం కల్పించలన్నారు.

ఎరువుల దుకాణాల తనిఖీ చేసిన డీఏవో

ఖమ్మంవ్యవసాయం, జనవరి18: మండలంలోని హోల్‌సేల్ ఎరువుల దుకాణాలను జిల్లా వ్యవసాయ అధికారి ఎం.విజయనిర్మల గురువారం తనిఖీ చేశారు. ఎరువుల నిల్వలు లెక్కలను సరిచూశారు. రైతులకు సకాలంలో ఎరువులు అందేలా చూడాలని సూచించరు.

మానవత్వం చాటిన ట్రాఫిక్ పోలీసులు

ఖమ్మంక్రైం, జనవరి18: ఫిట్స్‌తో పడిపోయిన మహిళను ముగ్గురు ట్రాఫిక్ పోలీసులు కాపాడారు. నగరంలోని పాతబస్టాండ్ వద్ద ఉన్న ఓ మెడికల్ షాపు ప్రాంతంలో ఓ మహిళ నడుస్తూ పడిపోయింది. సమీపంలోని ట్రాఫిక్ కానిస్టేబుళ్లు శ్రీనివాసరావు, జె.సాయిలు, హోంగార్డు వీరభద్రం గమనించి చేతులు, కాళ్లు రుద్ది తక్షణమే 108 సహాయంతో ఆసుపత్రికి తరలించారు. ఏసీపీ సారంగపాణి సీఐ అశోక్ వీరిని అభినందించారు.

చాంబర్ సీనియర్ సభ్యుడు రామారావు కన్నుమూత

ఖమ్మంవ్యవసాయం, జనవరి18: చాంబర్ ఆఫ్ కామర్స్ దాల్‌మిల్ శాఖ మాజీ అధ్యక్షుడు సీనియర్ సభ్యుడు తేరాల రామారావు(80) గురువారం కన్నుమూశారు. చాంబర్ ఆఫ్‌కామర్స్ గౌరవ అధ్యక్షుడు మేళ్ల చెరువు వెంకటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి మెంతుల శ్రీశైలం, ఉపాధ్యక్షుడు సోమ నరసింహారావు, సహాయ కార్యదర్శి మన్నెం కృష్ణయ్య, సెంట్రల్ ఈసీ సభ్యులు కైలాసపు వేణుగోపాలరావు, విడాల శ్రీనివాసరావు, సభ్యులు కల్వకుంట్ల గోపాలరావు వారి భౌతిక కాయాన్ని సందర్శించి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

వలస కూలీలకు స్వెటర్ల పంపిణీ

సత్తుపల్లి, జనవరి18: సత్తుపల్లికి చెందిన సుధా హెర్బల్ ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో వలస కూలీలకు స్వెటర్లను గురువారం పంపిణీ చేశారు. ట్రస్ట్ ఫౌండర్ సుధారాణి వీటిని అందజేశారు.

ప్రాజెక్ట్స్ ఇన్స్పైర్ అవార్డుల నమోదు గడువు పొడిగింపు

ఖమ్మం ఖానాపురంహవేలి, జనవరి18: ఇన్స్పైర్ అవార్డ్స్ 2022-23 సంవత్సరానికి ప్రాజెక్ట్ మనక్ ఈ కాంపిటీషన్ యాప్‌లో ఆన్లైన్లో నమోదుకు గడువు ఈ నెల 27 వరకు పొడిగించారని జిల్లా విద్యాశాఖ అధికారి సోమశేఖర శర్మ తెలిపారు.

జిల్లా స్థాయి సైన్స్‌ఫేయిర్‌కు 182 ప్రాజెక్టులు

జిల్లాస్థాయి సైన్స్ ఫేయిర్‌కు గురువారం రాత్రి వరకు 182ప్రాజెక్టులు వచ్చాయని జిల్లా సైన్స్ అధికారి దుస్సా జగదీశ్వర్ తెలిపారు. 20నుంచి 22 లోగా పరిశీలించి విజేతలను ప్రకటిస్తారని డీఈవో సోమశేఖర శర్మ తెలిపారు. ప్రథమస్థానం పొందిన విజేతను రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేస్తామని చెప్పారు.

ఉద్యోగులను కలిసిన టీఎన్జీవో నేతలు

ఖమ్మంకలెక్టరేట్, జనవరి18: నీటిపారుదల శాఖ, డీపీఆర్వో కార్యాలయాలతో పాటు వివిధ కార్యాలయాల్లో పనిచేస్తున్న ఉద్యోగులను గురువారం టీఎన్జీవో నాయకులు కలిశారు. కొణిదెన శ్రీనివాస్, దుర్గాప్రసాద్, గుంటుపల్లి శ్రీనివాస్, వల్లపు వెంకన్న తదితరులు ఉద్యోఉగలను కలిశారు.

టాలెంట్ టెస్టులో 'హార్వెస్ట్' విద్యార్థి ప్రతిభ

ఖమ్మంఖానాపురంహవేలి,జనవరి18: డాక్టర్ ఎఎస్‌రావు అవార్డు కౌన్సిల్ సైన్స్‌టాలెంట్ సెర్చ్ ఎగ్జామినేషన్‌లో నగరంలోని హార్వెస్ట్ పాఠశాల విద్యార్థులు ప్రథమస్థానంలో నిలిచారని విద్యాసంస్థల కరస్పాండెంట్ రవిమారుత్, ప్రిన్సిపాల్ పార్వతీరెడ్డి తెలిపారు. 9,10వ తరగతి విద్యార్థులకు ఈ నెలలో ఖమ్మంలో నిర్వహించిన ఈ పరీక్షలో 58మంది పాల్గొని 34మంది రెండో రౌండ్‌కు ఎంపికైనట్లు తెలిపారు. 10వ తరగతి చదువుతున్న సీహెచ్ కృష్ణమాధుర్ నూరుశాతం పర్సంటైల్ సాధించి ఉభయ రాష్ట్రాల్లో ప్రథమస్థానంలో నిలిచారని, రేవంత్‌కుమార్, ఫణిక్‌చౌదరి మూడోస్థానంలో నిలిచారని చెప్పారు. కె.హర్షిత్ 5వ స్థానంలో నిలిచాడని తెలిపారు.

డిప్లొమా ఫలితాల్లో 'శ్రీచైతన్య' విద్యార్థుల ప్రభంజనం

ఖమ్మంఖనాపురంహవేలి,జనవరి18: టీఎస్ఎస్‌బీఐఈటీ విడుదల చేసిన డిప్లమా ఫలితాలలో ఖమ్మం రూరల్ మండలం పొన్నెకల్లు పరిధిలోని శ్రీచైతన్య ఇంజనీరింగ్ కాలేజీ విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారని కళాశాల ప్రిన్సిపాల్ పన్నాల కృష్ణమూర్తి తెలిపారు. 38 మంది 9 జీపీఏ సాధించినట్లు తెలిపారు. ఎండి.అనాజ్ అహ్మద్, వనమా పార్థసారధి 10 జీపీఏ సాధించారని చెప్పారు. కళాశాల చైర్మన్ మల్లంపాటి శ్రీధర్ , డైరెక్టర్ శ్రీమతి శ్రీవిద్య మాట్లాడుతూ ఉత్తమ ఫలితాలు సాధించేందుకు కృషిచేసిన అధ్యాపకులకు అభినందనలు తెలిపారు. కళాశాల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ సాయి గీతిక మాట్లాడుతూ విద్యార్థులు చదువులోనే కాకుండా ఉద్యోగ ఉపాధి అవకాశాలకు కావాల్సిన శిక్షణను అందిస్తున్నట్లు తెలిపారు.